ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -119 పేజీలు - 12 వెల - 03/- ఆదివారం 16 ఆగస్టు 2026



# భారత్ అభివృద్ధికి ‘సప్తధార’

**ఢిల్లీ ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్.**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ భవిష్యత్ అభివృద్ధికి కీలకమైన ఏడు రంగాలను ‘శక్తి సప్తధార’గా అభివర్ణించారు. దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చడంతో పాటు అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ఈ ఏడు శక్తులను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ.. తయారీ రంగం, రైతులు, సాంకేతికత, గతిశక్తి, రక్షణశక్తి, హరిత ఇంధనం, సాఫ్ట్ పవర్‌ను భారత్ బలాలుగా పేర్కొన్నారు. ఈ రంగాల్లో వేగంగా ముందుకు సాగితే దేశ వృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని చెప్పారు.

మిగతా 2లో.

**80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ**
- తయారీ రంగాన్ని ప్రపంచ సరఫరా కేంద్రంగా మార్చాలని పిలుపు
- రైతుల ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్లాలని సూచన
- సాంకేతికత, 6జీ రంగాల్లో భారత్ ముందుండాలని ఆకాంక్ష
- రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలతో దేశంలో గతిశక్తికి ఊతమివ్వాలని వెల్లడి
- ఆత్మనిర్భర్ రక్షణ, డ్రోన్ సాంకేతికతపై దృష్టి పెట్టాలని సూచన



# స్త్రీశక్తికి ఏడాది పూర్తి..

**ఏపీలో రోజూ 24 లక్షల మంది మహిళల ఉచిత ప్రయాణం**

**మహిళా ప్రయాణికులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన సీఎం చంద్రబాబు**



**అమరావతి ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్.**

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ‘స్త్రీ శక్తి’ ఉచిత బస్ ప్రయాణ పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని ప్రభుత్వం వెల్లడించింది.

మిగతా 2లో.



# వికసిత్ భారత్ లో ఏపీ కీలక పాత్ర

- కాకినాడలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి భారత్ ఎదుగుతోందని వ్యాఖ్య
- కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ

**కాకినాడ ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్**

బలమైన, సమర్థవంతమైన దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కాకినాడలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఒక తరం స్వాతంత్ర్యం కోసం పోరాడితే, మరో తరం దానిని కాపాడిందని గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన ‘వికసిత్ భారత్‘ సంకల్పంలో ఏపీ కూడా తనదైన కీలక పాత్ర పోషిస్తుందని

మిగతా 2లో.

# వికాసం నుంచి వైభవం వైపు

**80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమరావతిలో సీఎం చంద్రబాబు**

- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన కోసం ఐక్యంగా పనిచేద్దామని పిలుపు
- గత పాలనలోని విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తున్నామన్న సీఎం
- రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు, వచ్చే ఏడాది పోలవరం పూర్తిపై హామీ
- వివిధ శాఖల శకటాల ప్రదర్శన, ప్రతిభావంతులైన పోలీసులకు పతకాల ప్రదానం



**అమరావతి ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్.**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు మువ్వన్నెల జెండాను ఎగురవేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ఆయన స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.

మిగతా 2లో.



# లోక్ భవన్‌లో ‘ఎట్ హోం‘..

- సతీసమేతంగా హాజరైన సీఎం చంద్రబాబు
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లోక్ భవన్‌లో ‘ఎట్ హోం‘
- గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో తేనీటి విందు
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- పాల్గొన్న మంత్రులు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు



**అమరావతి ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్.**

గవర్నర్, ముఖ్యమంత్రి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ విజయవాడలోని లోక్ భవన్‌లో ‘ఎట్ హోం‘ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులను గవర్నర్ అబ్దుల్ నజీర్, ఆయన అర్ధాంగి సాదరంగా ఆహ్వానించారు.

మిగతా 2లో.

# ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం

- మనం అడ్రస్ లేనివాళ్లం కాదు.. మన కేరాఫ్ అడ్రస్ అమరావతి: మంత్రి లోకేశ్
- విజయవాడలో 80వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్
- ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని తమ విధానమని మరోసారి స్పష్టీకరణ
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని వెల్లడి
- కులమతాలకు అతీతంగా స్వర్ణాంధ్ర సాధన కోసం పనిచేద్దామని పిలుపు



# ప్రశ్నిస్తే కేసులా?

- రాష్ట్రంలో బ్రిటీష్ పాలనను తలపించేలా పక్షపాత వైఖరి..
- : స్వాతంత్ర్య వేడుకల్లో బొత్స
- తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- జాతీయ జెండాను ఆవిష్కరించిన బొత్స సత్యనారాయణ



**అమరావతి ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్.**

తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య

మిగతా 2లో.

# ఇక స్మార్ట్ రేషన్ కార్డులు

**సంగారెడ్డి లో ప్రారంభించిన సీఎం రేవంత్**

**ఫామ్‌హౌస్‌లో కాదు.. అసెంబ్లీలోకి రా.. కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్**

**ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్.**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని అన్నారు. ఫామ్‌హౌస్‌లో ఉండి విమర్శలు చేయడం కాదని, ప్రజల ముందుకు వచ్చి మాట్లాడాలని అన్నారు. సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు.

గతంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి పండించారని రేవంత్ విమర్శించారు. ఇప్పుడు రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతుంటే బీఆర్ఎస్ విమర్శలు

మిగతా 2లో.



# భారత్ అభివృద్ధికి 'సప్తధార'

**మొదటిపేజీ తరువాయి**

1. తయారీ రంగం: భారత్ భవిష్యత్ వృద్ధికి తయారీ రంగమే కీలకమని మోదీ అన్నారు. విడిభాగాలతో పాటు పూర్తి ఉత్పత్తులను దేశంలోనే తయారు చేయాలని సూచించారు. నాణ్యత, తక్కువ ఖర్చు, భారీ ఉత్పత్తితో ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ కీలకంగా మారాలని పిలుపునిచ్చారు.
2. రైతులు: వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాలకు మరింత ఊతమివ్వాలని ప్రధాని చెప్పారు. భారత రైతులకు ప్రపంచ మార్కెట్లు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఎగుమతులను పెంచాలని సూచించారు. చిరుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, కూరగాయలను ప్రపంచ బ్రాండ్లుగా మార్చాలని అన్నారు.
3. సాంకేతికత: కొత్త సాంకేతికతలు, డేటా సెంటర్లు, రోబోటిక్స్‌లో భారత్ ప్రపంచ కేంద్రంగా ఎదగాలని మోదీ ఆకాంక్షించారు. యూపీఐతో భారత సామర్థ్యం ప్రపంచానికి తెలిసిందని చెప్పారు. దేశంలో తయారైన 6జీ సాంకేతికతను దేశవ్యాప్తంగా విస్తరించాలని సూచించారు.
4. గతిశక్తి: దేశంలో రవాణా, అనుసంధాన వ్యవస్థలను మరింత వేగవంతం చేయాలని మోదీ అన్నారు. కొత్త రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మెరుగైన మౌలిక వసతులతో వ్యాపారాలకు మరింత ఊతం లభిస్తుందని చెప్పారు.
5. రక్షణశక్తి: రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశంలోనే రక్షణ పరికరాల తయారీని పెంచాలని సూచించారు. డ్రోన్లు, డ్రోన్ నిరోధక సాంకేతికతలపై పెట్టుబడులు పెంచాలని అన్నారు.
6. హరిత ఇంధనం: హరిత ఇంధన రంగాన్ని భారత్ అభివృద్ధికి కీలక శక్తిగా మోదీ పేర్కొన్నారు. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలకు పెద్దపీట వేయాలని సూచించారు. భవిష్యత్ ఇంధన అవసరాలను తీర్చేందుకు హరిత ఇంధనంపై దృష్టి పెట్టాలని అన్నారు.
7. సాఫ్ట్ పవర్: యోగా, హస్తకళలు, సినిమాలు, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్ భారత్ సాఫ్ట్ పవర్‌ను పెంచుతాయని మోదీ చెప్పారు. సృజనాత్మక రంగాలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. పర్యాటక రంగంలోనూ భారత్‌కు ఉన్న అవకాశాలను మరింతగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# ఇక స్మార్ట్ రేషన్ కార్డులు

**మొదటిపేజీ తరువాయి**




చేస్తోందన్నారు. రైతుల సంక్షేమంపై నిజమైన చర్చకు సిద్ధమైతే అసెంబ్లీ వేదికగా మాట్లాడుకుందామని సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్, బీజేపీ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని రేవంత్ అన్నారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాంటివని వ్యాఖ్యానించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు వస్తాయని గతంలో బీఆర్ఎస్ ప్రచారం చేసిందని, కానీ ఇప్పుడు రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవని రేవంత్ చెప్పారు. రైతు భరోసా పథకం కింద 32 నెలల్లో రూ. 36 వేల కోట్లు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం దేశంలో తక్కువ అప్పులు ఉన్న రైతులు తెలంగాణలోనే ఉన్నారని అన్నారు. బీజేపీ నేతలు ఆ నివేదికలు చదివితే నిజాలు తెలుస్తాయని వ్యాఖ్యానించారు. స్మార్ట్ రేషన్ కార్డులు కేవలం ప్లాస్టిక్ కార్డులు కావని, పేదల ఆత్మగౌరవానికి గుర్తని రేవంత్ చెప్పారు. ఆకలి తీర్చే భరోసానే ఈ కార్డుల ఉద్దేశమని అన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు రేషన్ వ్యవస్థను తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు.

# లోక్ భవన్‌లో 'ఎట్ హోం'..

**మొదటిపేజీ తరువాయి**




ఈ సందర్భంగా గవర్నర్, ముఖ్యమంత్రి ఇరువురూ ఒకరికొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం గవర్నర్ దంపతులు ఆహ్వానితులకు తేనీటి విందు ఇచ్చారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ స్వయంగా ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సైనిక అధికారులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రముఖుల రాకతో లోక్ భవన్ ప్రాంగణం పండుగ వాతావరణంలో సందడిగా మారింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమం కొనసాగింది.

అనారోగ్యం కారణంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కాకినాడలో ఇవాళ స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ లో పాల్గొన్న అనంతరం పవన్ తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో, ఆయన ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొనడంలేదని జనసేన పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. రాజమండ్రిలో వైద్య పరీక్షల అనంతరం పవన్ కల్యాణ్ హైదరాబాద్ వెళ్లిపోయారు.

# స్త్రీశక్తికి ఏడాది పూర్తి..

**మొదటిపేజీ తరువాయి**

పథకం తొలి వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ (ఆగస్టు 15) ఆర్టీసీ బస్సులో ప్రయాణించి, లబ్ధిదారులైన మహిళలతో ముచ్చటించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక ఆర్టీసీ బస్సు ఎక్కి, అందులో ప్రయాణిస్తున్న మహిళలతో మాట్లాడారు. పథకం అమలు తీరుపై వారి నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారి కుటుంబాలు, జీవనోపాధి, ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా వారికి కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు.

ఎన్డీయే ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీలలో భాగంగా 2025 ఆగస్టు 15న ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ప్రయాణ సమయంలో ఏపీకి చెందినవారని ధ్రువీకరించే గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఎంత దూరమైనా, ఎన్నిసార్లైనా ప్రయాణించేందుకు ఎలాంటి పరిమితి లేదు. ప్రధాన పండుగల సమయంలో దేవాలయాలకు నడిపే ప్రత్యేక బస్సులకు కూడా ఈ సౌకర్యాన్ని వర్తింపజేశారు. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 87 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయి. పథకానికి ముందు రోజుకు సగటున 9.47 లక్షలుగా ఉన్న మహిళా ప్రయాణికుల సంఖ్య, ఇప్పుడు 24 లక్షలకు చేరింది. దీంతో ఆర్టీసీ మొత్తం ప్రయాణికుల్లో మహిళల వాటా 40 శాతం నుంచి 62 శాతానికి పెరిగింది. ఈ పథకం వర్తించే బస్సుల్లో ఆక్యుపెన్సీ రేటు 93 శాతానికి చేరుకోవడం విశేషం. ఏపీఎస్ఆర్టీసీకి చెందిన 9,978 బస్సుల్లో దాదాపు 7,631 బస్సుల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉంది.

ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం రోజుకు రూ. 8.53 కోట్ల సబ్సిడీని భరిస్తున్నట్లు తెలిపింది. మొదటి ఏడాదిలో మొత్తం ఖర్చు రూ. 3,095 కోట్లుగా నమోదైంది. 2026-27 బడ్జెట్‌లో కూడా ఈ పథకం కొనసాగింపు కోసం రూ. 1,420 కోట్లు కేటాయించారు.

ఈ పథకం వల్ల మహిళలకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు విద్య, ఉపాధి, వైద్యం, వ్యాపారం వంటి అవసరాలకు సులువుగా ప్రయాణించే అవకాశం కలిగిందని ప్రభుత్వం పేర్కొంది. ఒక్కో లబ్ధిదారు కుటుంబానికి నెలకు సుమారు రూ. 1,000 ఆదా అవుతుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు. ఈ పథకం వచ్చాక కొన్ని రూట్లలో ప్రైవేట్ వాహనాలు, షేర్ ఆటోల వాడకం తగ్గి ప్రభుత్వ రవాణాకు ఆదరణ పెరిగింది. అయితే, మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో ఆర్టీసీపై అదనపు భారం పడుతోంది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా అదనపు బస్సుల అవసరాన్ని అంచనా వేస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గతంలో వెల్లడించారు. తెలంగాణలో 'మహాలక్ష్మి', కర్ణాటకలో 'శక్తి' పేరుతో ఇలాంటి పథకాలే అమలవుతున్నాయి. మహిళల అభివృద్ధి, వారి రవాణా ఖర్చులను తగ్గించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని కొనసాగిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# వికసిత్ భారత్ లో ఏపీ కీలక పాత్ర

**మొదటిపేజీ తరువాయి**

ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని భరోసా ఇచ్చారు.

అంతకుముందు పవన్ కల్యాణ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, నగర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పోలీస్ డాగ్స్ విన్యాసాలు చూసి ముగ్ధులైన పవన్, అన్నా కొణిదెల..



కాకినాడలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పోలీసు జాగిలాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం జాగిలాల బృందం చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా పవన్ అర్ధాంగి అన్నా కొణిదెల వాటిని ఆసక్తిగా వీక్షించారు. తన ఫోన్‌లో జాగిలాల విన్యాసాలను చిత్రీకరిస్తూ ఉత్సాహంగా కనిపించారు. విన్యాసాల్లో భాగంగా రాక్సీ అనే జాగిలం పవన్ కల్యాణ్ వద్దకు పుష్పగుచ్ఛంతో వచ్చింది. దాన్ని ఆయనకు అందించి సెల్యూట్ చేయడంతో ఆయన చిరునవ్వులు చిందిస్తూ గౌరవాన్ని స్వీకరించారు. అనంతరం మరో మూడు జాగిలాలు కలిసి పవన్‌కు ప్రత్యేక గౌరవ వందనం సమర్పించాయి. ఈ దృశ్యాలు కార్యక్రమానికి హాజరైన వారిని ఆకట్టుకున్నాయి.

ఆ తర్వాత జాగిలాల సామర్థ్యాన్ని పరీక్షించేలా కొన్ని సూట్‌కేసులను అక్కడ ఉంచారు. వాటిలో లగేజీ ఉన్న సూట్‌కేసులను గుర్తించమని సూచించగా.. లైకా అనే జాగిలం క్షణాల్లో సరైన వాటిని పసిగట్టింది. మరోవైపు రాక్సీ కూడా వాసన ఆధారంగా వస్తువులను గుర్తించింది. ఓ జాగిలం వివిధ దేశాల చిత్రపటాలను వాసన చూస్తూ, భారతదేశ చిత్రపటాన్ని గుర్తుపట్టి అక్కడే కూర్చోవడం అందరినీ అలరించింది. జాగిలాలు తమ శిక్షణకు తగ్గట్టుగా వరుసగా విన్యాసాలు చేయడంతో పవన్ సహా అక్కడున్న వారంతా ఆసక్తిగా వీక్షించారు. ముఖ్యంగా అన్నా కొణిదెల వాటిని ఫోన్‌లో బంధించిన దృశ్యాలు ఇప్పుడు అందరి దృష్టినీ ఆకట్టుకుంటున్నాయి.

## తీవ్ర జ్వరం.. 'ఎట్ హోమ్'కు గైర్హాజరు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఆయన, విజయవాడ లోక్ భవన్‌లో జరగాల్సిన 'ఎట్ హోం' కార్యక్రమానికి హాజరుకావడం లేదని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు లోక్ భవన్ అధికారులకు సమాచారం అందించినట్లు జనసేన పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది. శనివారం ఉదయం కాకినాడలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. అనంతరం రాజమండ్రిలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. అయితే, ఈ కార్యక్రమం జరుగుతుండగానే ఆయనకు జ్వరం తీవ్రమైంది. దీంతో కార్యక్రమాన్ని మధ్యలోనే ముగించుకుని ఆయన అక్కడి నుంచి వెనుదిరిగారు. వెంటనే రాజమండ్రిలో వైద్యులు ఆయనకు పరీక్షలు నిర్వహించి ప్రాథమిక చికిత్స అందించారు. జ్వరం కాస్త తగ్గుముఖం పట్టాక, తదుపరి విశ్రాంతి నిమిత్తం ఆయన హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల పవన్ కల్యాణ్ తన కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్నారని, వైద్యుల సూచనల మేరకు ప్రస్తుతం ఆయన ఫిజియోథెరపీ తీసుకోవాల్సి ఉందని కూడా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వికాసం నుంచి వైభవం వైపు

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్రాన్ని వికాసం నుంచి వైభవం వైపు, సుస్థిరత నుంచి స్వర్ణాంధ్ర దిశగా నడిపిస్తున్నామని, 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనకు ఐదున్నర కోట్ల మంది ఆంధ్రులు సంకల్పం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

"భారతీయులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. దశాబ్దాల పోరాటం, ఎందరో మహనీయుల త్యాగఫలమే మన స్వాతంత్ర్యం. 80 ఏళ్ల క్రితం మన పెద్దలు కన్న కలలను సాకారం చేసి, 2047 నాటికి దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెడదాం. ఈ దేశానికి మనమేం ఇవ్వగలమని ఆలోచించడమే 'అనే నేను...' సంకల్పం. రాబోయే 20 ఏళ్లు దేశ భవిష్యత్తు కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ప్రధాని మోదీ ఇచ్చిన వికసిత్ భారత్, మనం నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలు వేర్వేరు కావు. ఐక్యంగా ఈ లక్ష్యాలను సాధిద్దాం" అని ముఖ్యమంత్రి ఉద్బోధించారు.

**గత పాలన విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని విధాలా విధ్వంసానికి గురైందని, వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "గత పాలకుల అహంకారం, అవినీతి, అరాచకాలతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునర్నిర్మాణ బాధ్యతను స్వీకరించాం. గత 26 నెలల్లో విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి స్థిరత్వం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాధనే మా లక్ష్యం. ప్రజల మద్దతు, కూటమి ఐక్యత, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి కొత్త ఊపిరి పోశాం" అని తెలిపారు. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ వంటి అన్ని అంశాల్లో కేంద్రం సహకరిస్తోందన్నారు. గత ప్రభుత్వ అప్పులను రీషెడ్యూల్ చేసి రూ. 8,269 కోట్లు ఆదా చేశామని, రాష్ట్ర వృద్ధి రేటును 11.3 శాతానికి పెంచామని వివరించారు.

**పెట్టుబడుల వెల్లువ, ఉద్యోగాల కల్పన**

పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం నింపేందుకు 28 కొత్త పారిశ్రామిక విధానాలు తీసుకొచ్చామని సీఎం తెలిపారు. "ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం. ఇప్పటికే రూ. 24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదరగా, వాటిలో రూ. 14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. తద్వారా 11 లక్షల ఉద్యోగాలు వస్తాయి. గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, దాల్మియా సిమెంట్, హీరో, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి తరలివస్తున్నాయి. 36 రోజుల్లోనే ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు అనుమతులిచ్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను నిరూపించాం. యువత గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలు భర్తీ చేశాం. ఇకపై ఏటా డీఎస్సీ ఉంటుంది. ఇప్పటికే 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం" అని సీఎం పేర్కొన్నారు.

**వ్యవసాయం, సాగునీటి రంగాలకు పెద్దపీట**

'అన్నదాత సుఖీభవ' కింద ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు అందిస్తున్నామని, వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీని ప్రవేశపెడుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. "లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం. మదనపల్లెలో త్వరలో హార్టికల్చర్ యూనివర్సిటీకి శ్రీకారం చుడతాం. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ. 1.50కే అందిస్తున్నాం. గత 26 నెలల్లో సాగునీటి ప్రాజెక్టులపై రూ. 25 వేల కోట్లు ఖర్చు చేశాం. మరో మూడేళ్లలో రూ. 35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశాం. 30 ఏళ్ల కల అయిన వెలిగొండ ఫేజ్-1ను త్వరలో ప్రారంభిస్తున్నాం. వంశధార-నాగావళి అనుసంధానం 73 శాతం పూర్తయింది. వచ్చే ఏడాది పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తాం" అని హామీ ఇచ్చారు.

**అభివృద్ధి, సంక్షేమంలో సమతుల్యత**

రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని సీఎం వివరించారు. రాష్ట్రంలో రూ. 64 వేల కోట్ల రైల్వే పనులు, రూ. 38 వేల కోట్ల హైవే పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఐదున్నర కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీకగా అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మిస్తామన్నారు. మహిళా సాధికారతకు 'స్వయం బ్రాండ్', పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చామని పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, నకిలీ మద్యంపై ఉక్కుపాదం వంటి చర్యలు తీసుకున్నామన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ. 30,849 కోట్ల బకాయిలు చెల్లించామని, ప్రజా భద్రతలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని స్పష్టం చేశారు. 'ఈగల్ టాస్క్ ఫోర్స్' ద్వారా గంజాయి, డ్రగ్స్‌ను అణిచివేస్తున్నామని తెలిపారు.

ఈ వేడుకల్లో భాగంగా ఏపీఎస్పీ, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళాలు, ఎన్‌సీసీ, స్కౌట్స్ విద్యార్థులు నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో సాధించిన ప్రగతిని వివరిస్తూ వివిధ ప్రభుత్వ శాఖలు ప్రదర్శించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు పోలీసు అధికారులకు, సిబ్బందికి ముఖ్యమంత్రి పతకాలను ప్రదానం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం

**అమరావతి ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్.**

కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమష్టి కృషితో స్వర్ణాంధ్రను సాధించుకుందామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని మరోసారి స్పష్టం చేశారు. "ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. మనం అడ్రస్ లేని వాళ్లం కాదు.. మన కేరాఫ్ అడ్రస్ అమరావతి" అని ఆయన పునరుద్ఘాటించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం**

విద్యా వ్యవస్థలో తాము చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని గర్వంగా ప్రకటించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్లు, డొక్కా సీతమ్మ గారి పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో రాజకీయాలకు తావు లేకుండా చేశామని, పాఠ్యపుస్తకాలపై కానీ, పాఠశాలల వద్ద కానీ ఎక్కడా ముఖ్యమంత్రి లేదా తన ఫోటోలు ఉండవని స్పష్టం చేశారు. చరిత్రలో తొలిసారిగా, పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫోటోలతో ప్రకటనలు ఇచ్చామని గుర్తుచేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును సలహాదారుగా నియమించినట్లు వెల్లడించారు.

మహనీయుల త్యాగాలను స్మరించుకుందాం

లక్షలాది మంది త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని లోకేశ్ అన్నారు. మహాత్మా గాంధీ, నేతాజీ సుభాశ్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను ఎగురవేయడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. తన తాత, స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరు మీద ఉన్న జిల్లాలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనడం అరుదైన గౌరవమని తన వ్యక్తిగత ఆనందాన్ని పంచుకున్నారు. విజయవాడ నగరం విద్య, కళలకు నిజమైన రాజధాని అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రశ్నిస్తే కేసులా?

**మొదటిపేజీ తరువాయి**

నాయకులు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావుతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ అనంతరం బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుత పాలనా తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలనలో ఎలాంటి పక్షపాతం ఉండకూడదని, కానీ దురదృష్టవశాత్తూ రాష్ట్రంలో 'మనవాడా.. కాదా' అని చూసి సంక్షేమ పథకాలను అందించే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతులపై కేసులు పెడుతున్న



తీరు మళ్లీ బ్రిటీష్ పాలనను తలపిస్తోందని, మన పూర్వికులు ప్రాణాలర్పించి తెచ్చిన స్వాతంత్ర్య స్ఫూర్తి ఇదేనా అని నిలదీశారు. పోలీసులు అధికార పార్టీ నాయకుల వైపు కాకుండా ప్రజల పక్షాన నిలబడాలని సూచించారు.

ఓటు వేసినా, వేయకపోయినా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే నిజమైన పరిపాలన అని బొత్స స్పష్టం చేశారు. జగన్ హయాంలో విద్య, వైద్యం, రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేదరికం లేని సమాజ స్థాపన కోసం పాలన సాగిందని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు మాత్రమే అని భావిస్తోందని... పేదలకు విద్య, వైద్యం అందించడంలో, యువతకు ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

# ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**





**నంద్యాల క్రైం, ఆగస్టు 15, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా పోలీస్ అధికారుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వేడుకలు మిన్నంటిన వేళ, మన స్వేచ్ఛ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈనాటి మన స్వాతంత్ర్యం ఊరికే రాలేదని, ఎందరో మహనీయులు చెల్లించిన వెలకట్టలేని మూల్యానికి ఇదొక ప్రతీక అని అధికారులు స్పష్టం చేశారు. మన భారతదేశం ఈరోజు ఉన్న ఉన్నత స్థానాన్ని కాపాడుకుంటూ, ఈ స్వేచ్ఛను ఎప్పుడూ అలసత్వంగా (గ్రాంటెడ్‌గా) తీసుకోకూడదన్నారు. ఎంతోగానో కష్టపడి సాధించిన ఈ స్వతంత్ర ఫలాలను ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ గుండెల్లో పదిలపరుచుకోవాలని పిలుపునిచ్చారు. మన దేశం నిరంతరం పురోగమించేలా ప్రతి పౌరుడు తన వంతు అత్యుత్తమ కృషిని శాయశక్తులా కొనసాగించాలన్నారు. 80 ఏళ్ల స్వేచ్ఛా భారతాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించేందుకు అందరం కలిసికట్టుగా పునరంకితమవుదాం. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఖాదర్ భాషా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చిన్నికృష్ణ, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, డీపీఓ అడ్మినిస్ట్రేషన్ అధికారులు వీరన్న, ఖాదర్ వలీ, ఇన్స్పెక్టర్లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# కమిషనర్ బి. శేషన్నకు ప్రశంసా పత్రం

**ఉత్తమ పనితీరుకు గుర్తింపు**



**నంద్యాల క్రైం, ఆగస్టు 15, (రిపబ్లిక్ న్యూస్):** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నంద్యాల మున్సిపాలిటీలో ఉత్తమ పనితీరు కనబరిచిన మున్సిపల్ కమిషనర్ బి. శేషన్నను ఉత్తమ అధికారులలో ఒకరిగా ఎంపిక చేసి ప్రశంసా పత్రం అందజేశారు. నంద్యాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ చేతుల మీదుగా బి. శేషన్న ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.మున్సిపల్ పరిపాలన, పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో సమర్థవంతమైన పనితీరు కనబరిచినందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ ప్రశంసా పత్రం మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమిష్టి కృషికి దక్కిన గౌరవంగా బి. శేషన్న పేర్కొన్నారు.

# పీడీ వెంకటదాస్‌కు ప్రశంసా పత్రం

**మెప్మా సేవలకు గుర్తింపు**



**నంద్యాల క్రైం, ఆగస్టు 15, (రిపబ్లిక్ న్యూస్):** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నంద్యాల మెప్మా పీడీ వెంకటదాస్కు ఉత్తమ సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రం అందజేశారు. నంద్యాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ చేతుల మీదుగా వెంకటదాస్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితరులు పాల్గొన్నారు. మెప్మా ద్వారా పట్టణ పేదల సంక్షేమం, మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడంలో సమర్థవంతమైన సేవలు అందించినందుకు ఈ ప్రశంసా పత్రం అందజేశారు. ఈ గౌరవం మెప్మా అధికారులు, సిబ్బంది సమిష్టి కృషికి దక్కిన గుర్తింపుగా పీడీ వెంకటదాస్ పేర్కొన్నారు.

# యువ న్యాయవాదులకు పుస్తకాలను అందజేత

**మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజ -అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని గౌరవించాలి**

**-మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజ**

**-యువ న్యాయవాదులకు రూ.1.20లక్షల పుస్తకాలు అందచేత**





**నంద్యాల క్రైం, ఆగస్టు 15, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకొని నంద్యాల కోర్టు ఆవరణలో మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం న్యాయదేవతకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని గౌరవించాలన్నారు. అనంతరం న్యాయవాదుల క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందచేశారు. సీనియర్ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు మాట్లాడుతూ యువ న్యాయవాదులు ప్రతి విషయాన్ని తెలుసుకోవాలన్నారు. యువ న్యాయవాదులకు ఉపయోగపడేందుకు రెండు పుస్తకాలను అందచేస్తున్నానన్నారు. అనంతరం ప్రముఖ సీనియర్ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు తన స్వంత నిధులతో రూ.1.20లక్షల విలువైన సివిల్ ప్రొసీజర్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ పుస్తకాలను 50 మంది యువ న్యాయవాదులకు జడ్జి చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శిరీష్, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి సంఘమణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ లక్ష్మి కర్రి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జీవిఎన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, కార్యదర్శి గౌరీశంకర్, కృపావతి, ఈశ్వరప్రసాద్ రెడ్డి, అడ్డగాళ్ల వెంకటేశ్వర్లు, రావినూతల దుర్గాప్రసాద్, తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో కన్నుల పండుగగా 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు





**నంద్యాల క్రైం, ఆగస్టు 15, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ స్వాతంత్ర సమరయోధులు చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ స్వాతంత్ర్యం సాధించడం కోసం వారు పడిన శ్రమలను అర్పించిన ప్రాణ త్యాగాలను స్మరించుకోవాలిసిన అవసరం ఎంతైనా ఉందని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ఎంతగానో కష్టపడి సాధించిన ఈ స్వతంత్ర ఫలితాలను ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ గుండెల్లో పదిలపరుచుకోవాలని పిలుపునిచ్చారు. దేశభక్తిని భావితరాలకు అందించే దిశగా సమిష్టిగా కృషి చేయాలని తెలియజేశారు. అనంతరం నంద్యాల గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో రాష్ట్ర మైనారిటీ న్యాయశాఖ మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ పాల్గొన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పోలీసులచే గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను రాష్ట్ర మైనారిటీ న్యాయశాఖ మంత్రి ఫరూక్ ఆవిష్కరించారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు పోలీసుల కవాతును పరిశీలించారు. అనంతరం అధ్యంతం కన్నుల పండుగగా పోలీస్ కవాతు నిర్వహించడం జరిగింది.ఈ కవాతులో ఏఆర్ పోలీసులు,సివిల్ పోలీసులు, హోంగార్డ్స్ సిబ్బంది, ఎన్సీసీ విద్యార్థినీ విద్యార్థులు, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం న్యాయశాఖ మంత్రి మాట్లాడుతూ మనకు స్వతంత్రం రావడానికి ఎందరో స్వాతంత్ర సమరయోధులు తమ ప్రాణాలను అర్పించడం జరిగిందని ఈ సందర్భంగా వారిని గుర్తు చేసుకోవాలన్నారు. అనంతరం ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ ప్రభుత్వం అభివృద్ధి పారదర్శకమైన పాలన అనే లక్ష్యంతో ముందుకు సాగుతుందని ప్రజల సహకారంతో స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి పునాది వేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రిగారి చేతుల మీదుగా, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రభుత్వ పథకాల శకటాలు, పోలీస్ కవాతు, పిల్లల సంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రజలు, ఉపాధ్యాయులు, పెద్దలు ,స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలు, వి.వి.ఐ.పిలు, వీ.ఐ.పీ లు విద్యార్థిని విద్యార్థులు, ప్రభుత్వ శాఖలు వారి అధికార ప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొని స్వాతంత్ర దినోత్సవ వేడుకలను జయప్రదం చేశారు.

# దివ్యాంగుల సంక్షేమ సంఘం,కళారాధన, లయన్స్ క్లబ్, ఐఎంఏ,క్రీడా సమాఖ్య కార్యాలయం స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**-జాతీయ పతాకం ఎగురవేసిన డాక్టర్ రవికిష్ణ**




**నంద్యాల ఆగస్టు 15 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల కళారాధన సాంస్కృతిక సంస్థ, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం, లయన్స్ క్లబ్,క్రీడా సమాఖ్య కార్యాలయం వద్ద లయన్స్ అంతర్జాతీయ సంస్థ డిస్ట్రిక్ట్ 316 జె వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు, కళారాదన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ జాతీయ పతాకాన్ని ఎగురవేసి పతాక వందనం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాము ఎంచుకున్న రంగంలో అంకితభావంతో పనిచేసి దేశఅభివృద్ధిలో పాలుపంచుకోవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పి.వి. రమణయ్య,కార్యదర్శి రామలింగం, ఉపాధ్యక్షులు వెంకటరావు, కార్యవర్గ సభ్యులు రంగస్వామి, మధు కుమార్, చలపతి, వీరభద్రుడు, వినోద్, కరీముల్లా, నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి,కళారాధన కార్యవర్గ సభ్యులు శివరామిరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు చంద్రమోహన్ ఇమ్మడి రామకృష్ణుడు,రామయ్య,కార్యాలయ కార్యదర్శి మధు, తదితరులు పాల్గొన్నారు .

## నంద్యాలలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**నంద్యాల ఆగస్టు 15 (రిపబ్లిక్ న్యూస్) :** రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రధాన కార్యాలయం, నంద్యాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమితి ఉపాధ్యక్షులు ఏరువ రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమితి కార్యవర్గ సభ్యులు సౌదాగర్ కాసిం మియా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి స్వాతంత్ర్య స్ఫూర్తి, ప్రజా హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, రాయలసీమ అభివృద్ధి వంటి అంశాలపై విశదీకరించారు.భారతదేశం ఎంతో మంది త్యాగధనుల పోరాట ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని నేటి రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తి అనేది కేవలం ఒక వేడుకకే పరిమితం కాకుండా, ప్రజల హక్కుల సాధనకు, సమాన అభివృద్ధికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు మార్గదర్శకంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాల స్ఫూర్తి ప్రతి ఒక్కరి హృదయం నుండి ప్రారంభమై సమాజ మార్పుకు దోహదపడాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సమితి కార్యవర్గ సభ్యులు శంకర్ రెడ్డి, పట్నం రాముడు, ఎం.సి. కొండారెడ్డి, కొమ్మ శ్రీహరి, కృష్ణమోహన్, అసదుల్లా మియా, వెంకటేశ్వర నాయుడు, మురళి, మెహబూబ్ బాషా, రాఘవేంద్ర, సదాశివరెడ్డి, ఫర్వేజ్, రమణ తదితరులు స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర, ప్రస్తుత సామాజిక-రాజకీయ పరిస్థితులు, స్వాతంత్ర్య విలువలను సంరక్షించుకోవాల్సిన అవసరంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

జాతీయ పతాకావిష్కరణతోబ ప్రారంభమైన ఈ వేడుకల్లో స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణనిచ్చిన "వందేమాతరం" మరియు జాతీయ గీతం "జనగణమన" ఆలపించారు.

# గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**ఆకట్టుకున్న విద్యార్థుల మార్చ్ ఫాస్ట్**

**త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన ఎన్ఎండీ ఫిరోజ్**

**ముఖ్య అతిథులుగా ఎన్ఎండి ఫిరోజ్ , ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి**

**గురు రాజ ఇంటర్నేషనల్ స్కూల్ హెడ్ గర్ల్ హెడ్ బాయ్ బ్యాడ్జీలను అందించిన అతిథులు**






**నంద్యాల ఆగస్టు 15( రిపబ్లిక్ న్యూస్(:** గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా 80 స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి అధ్యక్షతన స్కూలు క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ పి దస్తగిరి రెడ్డి, టిడిపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, భాష ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర సురేష్ కుమార్, అతిథులుగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. స్కూల్ క్రీడా ప్రాంగణంలో విద్యార్థులు మేధా హౌస్ కళింగ హౌస్ పల్లవ హౌస్ శాతవాహన హౌసులుగా ఏర్పడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను విద్యా సంస్థల చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి ఎగురవేశారు. అనంతరం విద్యార్థుల మార్చ్ ఫాస్ట్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రం అనేది ఎంతోమంది ప్రాణాలను త్యాగం చేయడంతోనే వచ్చిందని తెలిపారు. ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర సమరయోధులను ఎన్నటికీ మరువరాదని గుర్తు చేశారు. స్వాతంత్ర దినోత్సవం రోజే వారిని గుర్తు చేసుకోవడమే కాకుండా ఎల్లప్పుడు వారిని మన మదిలో స్మరిస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని చెప్పారు. స్వాతంత్ర సమరయోధుల ఆశయాలను సాధిస్తే దేశం ప్రగతి పథంలో నడుస్తుందని గుర్తు చేశారు. ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల త్యాగ ఫలాలను నేటితరం అనుభవిస్తుందని వాటిని సక్రమంగా వినియోగించి భవిష్యత్ తరాలకు మరింతగా అందించేలా కృషి చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరి మరింత అభివృద్ధిలోకి రావాలని కోరారు. స్వాతంత్ర దినోత్సవం వేడుకగా జరుపుకోవడమే కాదని వాటికి సార్థకత చేకూరుస్తే భారతదేశం ప్రపంచ స్థాయిలో ముందడుగులో నిలుస్తుందని తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల బ్యాడ్జీలను అందించారు. ఇందులో ప్రధానంగా హెడ్ గర్ల్, హెడ్ బాయ్, డిస్ప్లిన్ కెప్టెన్, కల్చరల్ కెప్టెన్, హౌస్ కెప్టెన్, హౌస్ వైస్ కెప్టెన్, స్పోర్ట్స్ కెప్టెన్ వివిధ రకాల విభాగాల్లో బ్యాడ్జీలను అతిధులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చివరగా విద్యార్థుల చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.

# జీనియస్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా ఆగస్టు 15 సంబరాలు

## విద్యార్థుల సందడి.. వివిధ రకాల ఆటలు, పోటీలు.. విజేతలకు బహుమతుల ప్రదానం









**దేవనకొండ ఆగస్టు 15 (ప్రజా పబ్లిక్ న్యూస్):-**
దేవనకొండ జీనియస్ గ్లోబల్ స్కూల్‌లో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని పెంపొందించేలా పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది.పాఠశాల ప్రిన్సిపల్ మౌనిక ,ఏవో కాసిం ఆధ్వర్యంలో వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.
ఏవో కాసిం సార్, ఉపాధ్యాయుల బృందం కార్యక్రమాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.
విద్యార్థులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.
జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం విద్యార్థుల కోసం వివిధ రకాల ఆక్టివిటీస్ నిర్వహించారు.
ఆటలు, వినోదాత్మక కార్యక్రమాలు, వివిధ పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.చిన్నారుల నుంచి పెద్ద తరగతుల విద్యార్థుల వరకు పోటీల్లోఉత్సాహంగా పాల్గొన్నారు.విద్యార్థులు తమ ప్రతిభను చాటుకునేందుకు పోటీలను చక్కటి వేదికగా ఉపయోగించుకున్నారు.పోటీల సందర్భంగా పాఠశాల ప్రాంగణం విద్యార్థుల సందడితో కళకళలాడింది.ప్రతి కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు క్రమబద్ధంగా నిర్వహించారు.విద్యార్థుల్లో పోటీ తత్వంతో పాటు స్నేహభావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలను రూపొందించారు.ఆటలు, పోటీలతో విద్యార్థులు ఆనందంగా గడిపారు.పాఠశాల యాజమాన్యం విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రత్యేక బహుమతులను ఏర్పాటు చేసింది.వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేశారు.
మొదటి బహుమతి సాధించిన విద్యార్థులకు ప్రత్యేక గిఫ్ట్‌లను అందజేశారు.రెండో బహుమతి సాధించిన విద్యార్థులకు కూడా బహుమతులు అందించారు.
ప్రిన్సిపల్ మౌనిక మేడం చేతుల మీదుగా పలువురు విజేతలకు బహుమతులు అందజేశారు.ఏవో కాసిం సార్ చేతుల మీదుగా కూడా విజేతలకు గిఫ్ట్‌లను అందించారు.బహుమతులు అందుకున్న విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.తమ ప్రతిభకు గుర్తింపుగా బహుమతులు అందుకోవడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మౌనిక మేడం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆమె సూచించారు.దేశ అభివృద్ధిలో విద్యార్థులు భవిష్యత్‌లో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.క్రమశిక్షణ, విద్య, దేశభక్తితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.ఏవో కాసిం సార్ కూడా ఆగస్టు 15 ప్రాముఖ్యతను వివరించారు.స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను విద్యార్థులకు వివరించారు.
దేశాన్ని ప్రేమించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగి దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.ఉపాధ్యాయుల బృందం కూడా విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.దేశభక్తి, జాతీయ ఐక్యత, క్రమశిక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను అభినందించారు.
విద్యతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థిని ఉపాధ్యాయులు ప్రోత్సహించారు.విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరినీ అభినందించారు.
పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో దేశభక్తి భావన మరింత బలపడేలా కార్యక్రమాలు నిర్వహించారు.
పాఠశాల ప్రాంగణంలో జాతీయ జెండా రంగులు, దేశభక్తి నినాదాలతో సందడి నెలకొంది.
విద్యార్థులు ఆనందోత్సాహాలతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు.
ఉపాధ్యాయులు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేశారు.
విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం పట్ల తల్లిదండ్రులు కూడా హర్షం వ్యక్తం చేశారు.
జీనియస్ గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకలు విద్యార్థులకు మధురమైన జ్ఞాపకంగా నిలిచాయి.
విద్యార్థులలో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించారు.ప్రతి విద్యార్థి ఉత్సాహంగా పాల్గొనేలా పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.
కార్యక్రమం చివర్లో విజేతలకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు.ప్రిన్సిపల్ మౌనిక మేడం, ఏవో కాసిం సార్, ఉపాధ్యాయుల బృందాన్ని విద్యార్థులు అభినందించారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమాలు పాఠశాలలో దేశభక్తి వాతావరణాన్ని నెలకొల్పాయి.జీనియస్ గ్లోబల్ స్కూల్‌లో జరిగిన ఆగస్టు 15 వేడుకలు విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల సమన్వయంతో ఘన విజయంగా నిలిచాయి.

# కప్పట్రాళ్ల లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## విద్యార్థుల్లో దేశభక్తి స్ఫూర్తి నింపిన రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ

**దేవనకొండ ఆగస్టు 15 ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**
కప్పట్రాళ్ల గ్రామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.
ఈ వేడుకల్లో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పాల్గొన్నారు.గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలకు ఆమె హాజరయ్యారు.ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి జెండాకు గౌరవ వందనం చేశారు.అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి బొజ్జమ్మ ప్రసంగించారు.దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ఆమె స్మరించుకున్నారు.స్వాతంత్ర్య సమరయోధుల పోరాట ఫలితంగానే మనకు స్వేచ్ఛ లభించిందని తెలిపారు.
విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.
విద్యార్థులు భవిష్యత్తులో దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.
విద్యతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యతను



అలవర్చుకోవాలని సూచించారు.
దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆమె కోరారు గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యలో ముందుకు సాగేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించాలన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.పాఠశాలల ప్రాంగణాలు జాతీయ జెండాలతో, దేశభక్తి వాతావరణంతో కళకళలాడాయి.ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.స్వాతంత్ర్య స్ఫూర్తితో దేశ అభివృద్ధి కోసం అందరూ కలిసి ముందుకు సాగాలని బొజ్జమ్మ పిలుపునిచ్చారు.
విద్యార్థులలో దేశభక్తి భావనను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.



ఈ సందర్భంగా పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు బొజ్జమ్మకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.కప్పట్రాళ్లలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి స్ఫూర్తిని చాటుతూ ఘనంగా ముగిశాయి.దేశ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు జై హింద్! జై భారత్! తెలియజేశారు

# ప్రశంసా పత్రశీ అందుకున్న సి ఐ నాగరాజారావు



**ఆళ్లగడ్డ ఆగష్టు. 15 రిపబ్లిక్ న్యూస్**
80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా కేంద్రం లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ ఎం డి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ గనర్, జిల్లా ఎస్ పి సునీల్ షోరాన్ చేతుల మీదుగాఉత్తమ సేవలకుఉత్తమ ప్రశాంసాపత్రం ఆళ్లగడ్డ పట్టణ సి ఐ నాగరాజారావు అందుకున్నారు ఈ సందర్భంగా ఆళ్లగడ్డ డి ఎస్ పి శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు, పుర ప్రముఖులు అభినందనలు, శుభాకాంక్షలు తిలిపారు

# వైద్యసేవే.. దేశసేవ

## ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడితే దేశానికి సేవ చేసినట్లే

**కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 15)**
ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడితే దేశానికి సేవ చేసినట్లేనని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ అన్నారు. "దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అని మహాకవి గురజాడ అప్పారావు చెప్పిన మాటలను గుర్తుచేస్తూ, ప్రజల ప్రాణాలను కాపాడటమే వైద్యుల అసలైన దేశసేవ అని పేర్కొన్నారు.80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. వైద్య విద్యార్థుల భవిష్యత్తు అధ్యాపకుల చేతుల్లోనే ఉందని, వారిని నైపుణ్యం, సేవాభావం, మానవతా విలువలతో తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు.సమర్థవంతమైన వైద్యులను తయారు చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయడమే నిజమైన దేశసేవ అని డాక్టర్ చిట్టి నరసమ్మ తెలిపారు. వైద్యులు వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా సేవా దృక్పథంతో నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ, జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, రీజినల్ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సి.ఎస్.కె. ప్రకాష్, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ ఇండియా శుభప్రద, సీనియర్ వైద్యులు డాక్టర్ విక్రమ్ సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ సబ్జెక్టులో స్కూల్ టాపర్‌కు ఘన సన్మానం

## మెడల్‌తో వెంకట సింధుజాను అభినందించిన ఎఫ్ఆర్ హైస్కూల్ యాజమాన్యం



**దేవనకొండ ఆగస్టు 15 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
దేవనకొండ మండలంలోని ఫ్రెండ్స్ రూరల్ హైస్కూల్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని ఘనంగా సన్మానించారు.ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో సోషల్ సబ్జెక్టులో స్కూల్ టాపర్‌గా వెంకట సింధుజా నిలిచింది.రవీంద్రరెడ్డి, రాజేశ్వరి దంపతుల కుమార్తె వెంకట సింధుజా ఈ ఘనత సాధించింది.సోషల్ సబ్జెక్టులో అత్యుత్తమప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చింది.
ఈ సందర్భంగా పాఠశాల హెడ్‌మాస్టర్ ఉచ్చిరప్ప సింధుజాను ప్రత్యేకంగా అభినందించారు.ఆమెను మెడల్‌తో సత్కరించి అభినందనలు తెలిపారు.పాఠశాల సిబ్బంది కూడా సింధుజాను ఘనంగా సన్మానించారు.విద్యార్థులు కూడా ఆమె విజయాన్ని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఈవిజయం నిరూపించిందని హెచ్‌ఎం పేర్కొన్నారు.విద్యార్థులు సింధుజాను ఆదర్శంగా తీసుకుని చదువులో రాణించాలని సూచించారు.పాఠశాల స్థాయిలో సోషల్ సబ్జెక్టులో టాపర్‌గా నిలవడం అభినందనీయమన్నారు.సింధుజా సాధించిన విజయంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం పాఠశాల లక్ష్యమని హెచ్‌ఎం తెలిపారు.చదువుతో పాటు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్నిపెంపొందించేందుకు పాఠశాలలో ప్రోత్సాహం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.సింధుజా భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఉపాధ్యాయులుఆకాంక్షించారు.తన విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సింధుజా కృతజ్ఞతలు తెలిపింది.ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది సింధుజాకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది విద్యార్థులకు స్ఫూర్తి కలుగుతుందని తెలిపారు.వెంకట సింధుజా సాధించిన విజయం పాఠశాల విద్యార్థులకు ప్రేరణగా నిలిచింది.సోషల్ సబ్జెక్టులో స్కూల్ టాపర్‌గా నిలిచిన వెంకట సింధుజాను మెడల్‌తో సత్కరించిన కార్యక్రమం ఘనంగా ముగిసింది.

# దేవనకొండలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## ఎంపీడీవో జ్యోతి, జడ్పీటీసీ కిట్టు, ఎంపీపీ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ





**దేవనకొండ, ఆగస్టు 15 (ప్రజా పబ్లిక్ న్యూస్ ):-**దేవనకొండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఎంపీడీవో జ్యోతి, జడ్పీటీసీ కిట్టు, ఎంపీపీ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు.కార్యాలయ ఆవరణలో మువ్వన్నెల జెండా రెపరెపలాడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అధికారులు, సిబ్బంది జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు.దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను అధికారులు కొనియాడారు.వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు.దేశ సమైక్యత, సమగ్రతనుకాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరేలా కృషి చేయాలని తెలిపారు.యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.విద్యార్థులు, యువత దేశభక్తి, క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు.కార్యాలయ సిబ్బంది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.
కార్యక్రమం సందర్భంగా కార్యాలయ ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.
జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం దేశభక్తి నినాదాలు మార్మోగాయి.
అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పరం స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.
జైహింద్.. జై భారత్ అంటూ వేడుకలను ఘనంగా ముగించారు.

# దేశభక్తి నినాదాలతో మార్మోగిన డీఐజీ క్యాంపు కార్యాలయం

## కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 15)**
కర్నూలు రేంజ్ డీఐజీ క్యాంపు కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఐపీఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం గావించారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా డీఐజీ కోయ ప్రవీణ్ పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ, దేశభక్తి స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని సూచించారు.అనంతరం పోలీసు సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఏఓ మాధవి, డీఐజీ కార్యాలయ మేనేజర్ రత్న ప్రకాష్, సీఐ (లైజనింగ్ ఆఫీసర్) తిక్కస్వామి, డీఐజీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# స్కేటింగ్ తో జ్యోతి స్కూల్ విద్యార్థుల తిరంగా ర్యాలీ



**బండి ఆత్మకూరు, ఆగస్టు 15, (రిపబ్లిక్ న్యూస్):** బండి ఆత్మకూరు జ్యోతి స్కూల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పలువురు జ్యోతి స్కూల్ విద్యార్థులు బండి ఆత్మకూరు నుంచి ఆత్మకూరు, నంద్యాల ప్రధాన రహదారిలో స్కేటింగ్ చేస్తూ జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీలు నిర్వహించి దేశభక్తిని చాటుతున్నారు.రోడ్డుపై స్కేటింగ్ చేస్తూ విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని ముందుకు సాగారు. అయితే విద్యార్థులు చేస్తున్న ఈ తిరంగ ర్యాలీలో రహదారిలో అటుగా వెళుతున్న వాహన దారులు వాహనాలు ఆపి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారత్ మాతా కీ జై, వందేమాతరం అంటూ నినాదాలు చేస్తూ రోడ్డు వెంట ర్యాలీ కొనసాగించారు. అంతకు ముందుగా పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుల వస్త్రధారణలో విద్యార్థులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కామేశ్వర ప్రసాద్**

**పెరేడ్ గ్రౌండ్స్‌లో వైద్య ఆరోగ్య శాఖ శకటానికి మూడో బహుమతి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 15)**
కర్నూలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం ఉదయం 8 గంటలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కామేశ్వర ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు.అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని అందిస్తూ.. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని తెలిపారు. వారి త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నిరంతరం స్మరించుకుంటూ దేశ అభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.కాగా, పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటానికి మూడో బహుమతి లభించింది. ఈ సందర్భంగా శాఖ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# ప్రగతి పథంలో 'నగర' అడుగులు

**మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 15)**
కర్నూలు నగరాన్ని అభివృద్ధి, పరిశుభ్రత, సుందరీకరణలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమష్టిగా కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముందుగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన కమిషనర్ అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.కర్నూలు నగరాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు పరిశుభ్రత, సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని కోరారు.అనంతరం వివిధ విభాగాల్లో అత్యుత్తమ విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులకు కమిషనర్ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ జునైద్, కార్యదర్శి నాగరాజు, ఎస్‌ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఆర్వోలు మంజూర్ బాష, క్రిస్టోఫర్, ఇన్‌చార్జి డీసీపీ శబ్నం శాస్త్రి, అకౌంట్స్ ఆఫీసర్ రఘునందన్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## చౌడేపల్లి మండలంలో స్వాతంత్ర దినోత్సవ అవార్డు గ్రహీతలు వీరే



**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్**
చౌడేపల్లి మండలంలో ఉద్యోగరీత్యా అంకితభావం చూపిస్తూ ప్రజల మన్నలు పొందిన అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డులు లభించాయి. అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లిలో వారికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి ,ఎస్పీ ధీరజ్ కునుబిల్లీ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ బోయకొండ కమిషనర్ ఏకాంబరం ఆర్ఐ భరత్ వీఆర్వోలు సుప్రియ, జీవనజ్యోతి ,సర్వేయర్ విజయ్ కుమార్ ,సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమారి, వీఆర్ఏ రెడ్డి రత్న ,అదే విధంగా ప్రభుత్వ కంటి వైద్య సహాయకుడు రహమత్ అలీ ఖాన్ , లద్దిగం ఏఎన్ఎం హేమలత అవార్డులను అందుకున్న వారిలో ఉన్నారు వారందరికీ ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు.

# కర్నూలు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**





**కర్నూలు క్రైమ్ (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 15)**కర్నూలు జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండా వందనం గావించారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ, పోలీసు సిబ్బంది ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు.అనంతరం పోలీసు సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐలు మధుసూదన రావు, కేశవరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు ఖాజావలి, ఉస్మాన్, ఎస్పీ సీసీ సాకేత్‌తో పాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# విద్యలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్**
విద్యలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు పలువురు దాతలు నగదు ప్రోత్సాహకాలను అందించారు.ఇటీవల జరిగిన పది పరీక్షల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు దాత సుజన్ రాజు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు మండలంలోని చౌడేపల్లి చారాల మేకలచినేపల్లి విద్యార్థులకు రూ 70 వేలను పంపిణీ చేశారు అదేవిధంగా చౌడేపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలలో 5నుంచి 10వరకు గల ఎస్సీ ఎస్టీ బాలికలకు కెనరా బ్యాంక్ మేనేజర్ జయదేవ్ ఆధ్వర్యంలో రూ 24 వేలను బ్యాంకు తరపున కానుకగా అందించారు. వీరితోపాటు ఎస్సీ హాస్టల్ వార్డెన్ సురేష్ రెడ్డి ఒకరికి రూ 2వేలు అందించాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్ రెడ్డి, రేణుకమ్మ, చంద్రశేఖర్, సుజన్ రాజు మిత్రబృందం ప్రభాకర్, కృష్ణమూర్తి ,హేమంత్, అమర్నాథ్ ,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర పోరాట ప్రతిమ యువతలో ఉండాలి



**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్**
జాతీయ నాయకుల స్వాతంత్ర పోరాట ప్రతిమ యువతలో ఉండాలని పలువురు అన్నారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు పాఠశాలల నందు ఆయా శాఖల ఉన్నతాధికారుల చేతులమీదుగా జాతీయ జెండాను ఎగుర వేశారు. స్థానిక మండల పరిపాలన భవనం ముందు మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి జెండాను ఎగరేశారు. అదేవిధంగా తహసిల్దార్ కార్యాలయంలో పార్వతి పోలీస్ స్టేషన్ వద్ద పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్,బోయకొండ లో ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం, ఆయా కార్యాలయాల వద్ద ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రైవేటు కళాశాల నందు జాతీయ జెండాను ఎగరేసి స్వాతంత్ర పోరాటంలో దేశ నాయకులు చేసినటువంటి కృషిని వివరించారు. ఆయా కేంద్రాల వద్ద స్థానికులు అధికారులు పిల్లలకు చాక్లెట్లు, కేకులను కట్ చేసి పంచిపెట్టారు.

# అంబరాన్నంటిన స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

**మండల వ్యాప్తంగా రెపరెపలాడిన జాతీయ పతాకం**



**బండి ఆత్మకూరు, ఆగస్టు 15 ,( రిపబ్లిక్ న్యూస్) :** బండి ఆత్మకూరు మండల వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామ సచివాలయాల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.బండి ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ పద్మావతమ్మ, ఫారెస్ట్ కార్యాలయంలో రేంజర్ నాసిర్ ఝా, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జగన్మోహన్, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ సవిత జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు.బండి ఆత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజా సమస్యలు, గ్రామ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు సీఐ రామారావుకు అవార్డు



**గుత్తి, ఆగస్టు 15: (రిపబ్లిక్ న్యూస్)**
పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు గుత్తి సీఐ ఎం. రామారావుకు జిల్లా స్థాయి ఉత్తమ సేవా అవార్డు లభించింది. శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఎస్పీ జగదీష్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా రామారావు అవార్డును అందుకున్నారు. విధి నిర్వహణలో నిబద్ధత, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, శాంతిభద్రతల పరిరక్షణలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేశారు.ఈ సందర్భంగా సీఐ రామారావును ఎస్సైలు సురేష్, అమీర్‌ఖాన్‌తో పాటు పోలీసు సిబ్బంది, పలువురు ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు శాఖలో మరింత సమర్థవంతంగా సేవలందిస్తూ గుత్తి ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

# ఉత్తమ సేవలకు ప్రజల ప్రశంసలు

**బండి ఆత్మకూరులో అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవ పురస్కారాలు**



డాక్టర్.వసుధ రెడ్డి, ఏ పి ఓ



శివ లింగం , కానిస్టేబుల్



శ్యామ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్



లక్ష్మయ్య, ఏ ఈ ఓ

**బండి ఆత్మకూరు ,ఆగస్టు 15, ( రిపబ్లిక్ న్యూస్)** : విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి ప్రజలకు అంకితభావంతో సేవలందించిన బండి ఆత్మకూరు మండలంలోని పలువురు అధికారులకు ప్రశంస పత్రాలు అందాయి. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని జిల్లా స్థాయిలో బండి ఆత్మకూరు మండలానికి చెందిన ఆరుగురు ఉద్యోగులు, సిబ్బందికి జిల్లా స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. నంద్యాలలో నిర్వహించిన 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, ఎస్పీ సునీల్ షేరాన్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు.
గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో డాక్టర్ వసుధారెడ్డి, పోలీస్ కానిస్టేబుల్ శివలింగం, తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్యాం కుమార్,వ్యవసాయ శాఖ ఏఈఓ ఎం. లక్ష్మయ్య, ఏ కోడూరు సొసైటీ సి ఈ ఓ శ్రీనివాసు, సంతజూటూరు సొసైటీ సీఈవో గోపాల్, అదేఅదే గ్రామానికి చెందిన ఆశా వర్కర్ బేతి సువర్ణమ్మలు శనివారం ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు.వసుధారెడ్డి ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ, సిబ్బంది సమన్వయంలో, శివలింగం శాంతిభద్రతల పరిరక్షణలో, శ్యాం కుమార్ రెవెన్యూ కార్యాలయ విధుల్లో, సొసైటీ ద్వారా రైతులకు ఉత్తమ సేవలకు గాను సి ఈ ఓ శ్రీనివాసులు,సువర్ణమ్మ గ్రామీణ ఆరోగ్య సేవల్లో, లక్ష్మయ్య రైతులకు వ్యవసాయ సేవలు, ప్రభుత్వ పథకాలను చేరువ చేయడంలో అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు లభించాయి. దీంతో సమాచారం ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులతోపాటు మండల ప్రజలతో సైతం వారు ప్రశంసలు అందుకున్నారు.



సంత జుటూరు సొసైటీ సీఈఓ గోపాల్

ఒకే మండలానికి చెందిన ఆరుగురు ఉద్యోగులు జిల్లా స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారాలు అందుకోవడం బండి ఆత్మకూరు మండలానికి గర్వకారణంగా నిలిచిందనీ మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# వైయస్ ఆర్ సిపికాటసాని రామభూపాల్ రెడ్డి పై కేసు నమోదు

**కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి ఫైర్**

**కల్లూరు ప్రతినిధి, ఆగస్టు 15 (రిపబ్లిక్ న్యూస్)**
వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పర్యటనలో వెల్లువెత్తిన ప్రజాదరణను చూసి కూటమి ప్రభుత్వం భయపడుతోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి మండిపడ్డారు.అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే భయపడేది లేదని, ప్రజల కోసం ఎంతటి న్యాయ పోరాటానికైనా సిద్ధమని కాటసాని రామభూపాల్ రెడ్డి గారు స్పష్టం చేశారు,వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని చూసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా భారీగా తరలివచ్చారని, అయితే జనం సమీకరణ చేశారంటూ తమపై తప్పుడు కేసులు నమోదు చేయడం కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని అన్నారు.ఎలాంటి నిరాధార ఆధారాలు లేకుండానే 189(2), 126(2) దీచీా సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారని, ప్రజల నుంచి వస్తున్న ఆదరణను అడ్డుకునేందుకే ప్రభుత్వం పోలీసులను ఉపయోగిస్తోందని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, అదే సమయంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారితోనే ప్రజలకు మేలు జరుగుతుందనే నమ్మకం మరింత బలపడటంతో ప్రజలు ఆయనకు నీరాజనం పడుతున్నారని కాటసాని రామభూపాల్ రెడ్డి అన్నారు.తప్పుడు కేసులకు వైఎస్సార్‌సీపీ భయపడదు. అక్రమ కేసులపై చట్టపరంగా, న్యాయపరంగా పోరాడుతాం. ప్రజల పక్షాన మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది అని కాటసాని రామభూపాల్ రెడ్డి తెలియజేశారు.



# సంక్షేమం.. అభివృద్ధే ధ్యేయం



## ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ -రైతు సంక్షేమమే ప్రథమ కర్తవ్యం
## -జిల్లాలో పరిశ్రమలతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు -ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

**ప్రజా రిపబ్లిక్ ప్రత్యేక కథనం, ఉమ్మడి అనంతపురం**

అనంతపురం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపించి "స్వర్ణ అనంతపురం" గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రైతాంగానికి అండగా నిలవడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్ర పునర్నిర్మాణం వేగంగా సాగుతోందన్నారు.

అనంతపురం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.02 గంటలకు మంత్రి పయ్యావుల కేశవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అంతకుముందు వందేమాతరం ఆలపించారు. అనంతరం కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి పరేడ్‌ను పరిశీలించారు. సాయుధ దళాల పరేడ్ బృందం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించింది. అనంతరం మంత్రి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

### స్టాల్స్ ను పరిశీలించిన మంత్రి పయ్యావుల

అనంతపురం నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా ఆకట్టుకున్న సాంస్కృతి కార్యక్రమాలు, స్టాల్స్ ను పరిశీలించారు. అనంతరం ఆయా శాఖల జిల్లా అధికారులకు ప్రశంస పత్రాలను ఆ తరువాత రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గారి చేతుల మీదుగా 3702 మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు 564.66 కోట్లు, 10285 మంది సభ్యులకు శ్రీనిధి రుణాలు 108.82 కోట్ల రూపాయలు మొత్తం 673.48 కోట్ల రూపాయల మెగా చెక్కును మంత్రి లబ్ధిదారులకు అందజేశారు.




### త్యాగాల స్ఫూర్తితో బాధ్యతలు నిర్వర్తించాలి

స్వాతంత్ర్యం కోసం ఎందరో అమర వీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని మంత్రి గుర్తుచేశారు. మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్, వీర్ సావర్కర్, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్, సర్దార్ వల్లభాయ్ పటేల్, అల్లూరి సీతారామరాజు తదితరుల పోరాటాలు దేశానికి స్ఫూర్తిదాయకమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కుటుంబాల వేదన, కన్నీళ్లు, త్యాగాలు ఉన్నాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం అంటే కేవలం స్వేచ్ఛను గుర్తుచేసుకోవడం కాదని.. మన బాధ్యతలను కూడా గుర్తుచేసుకోవాలని అన్నారు. దేశం నాకు ఏమిచ్చింది అని కాకుండా "దేశానికి నేనేమిచ్చాను" అని ప్రతి ఒక్కరూ ఆత్మావలోకనం చేసుకోవాలన్నారు. అనంతపురం జిల్లా నుంచి పప్పూరు రామాచార్యులు, కైప సుబ్రమణ్యశర్మ, గుత్తి కేశవపిళ్లై, ఐదుకల్లు సదాశివన్, గుత్తి రామకృష్ణ, పెద్దగొంది కొండప్పశ్రేష్ఠి, జీవరత్నమ్మ, ఆదిశేషయ్య, హంపన్న తదితరులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. వారందరికీ నివాళులర్పించారు.

### రూ.69 కోట్ల పెట్టుబడితో పరిశ్రమల ఏర్పాటు

జిల్లా యువత ఉద్యోగాల కోసం బెంగళూరు, హైదరాబాద్ వైపు వెళ్లాల్సిన పరిస్థితిని మార్చేందుకు పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి తెలిపారు. కళ్యాణదుర్గం పరిధిలోని తిమ్మసముద్రం వద్ద సరళ ఏవియేషన్, ఆస్ట్రోబేస్ స్పేస్ టెక్నాలజీస్, స్పేస్ ఫీల్డ్స్ వంటి పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు.

పరిశ్రమల కోసం జిల్లాలో సుమారు 1,537 ఎకరాల ల్యాండ్‌బ్యాంక్ సిద్ధంగా ఉంచామని, ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో రూ.69 కోట్ల పెట్టుబడితో 2 వేలకుపైగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటై 7 వేల మందికిపైగా ఉపాధి పొందారని పేర్కొన్నారు. అక్టోబరు 23న అనంతపురం జేఎన్‌టీయూలో ఏపీ ఈడీబీ, సీఐఐ ఆధ్వర్యంలో పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్2026 ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా. రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్, పోలీస్ హెడ్ క్వార్టర్స్ అనంతపురం, విద్యార్థులు "వందేమాతరం అనే పాటకు" కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం బుక్కరాయసముద్రం, "జయహో జయహో" కె.ఎస్.ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల అనంతపురం, "వందేమాతరం మాభూమి ఆకాశము".కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కురుగుంట, "జయహో జయహో నా భారతం" క్రిస్టోస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అనంతపురం, "ఒకే ఒక్క దేశము"కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయము కూడేరు, "తెలుగు పల్లె గుండెచప్పుడు" అనే దేశభక్తి గేయాలకు విద్యార్థులు ఆహుతులను ఆకట్టుకునే విధంగా నృత్య ప్రదర్శన చేశారు. ఇందులో పాల్గొన్న పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ గారి చేతుల మీదుగా విద్యార్థులకు మెమెంటో, ప్రశంస పత్రాలు అందజేశారు.

### మీడియా, ప్రజల సమన్వయంతో జిల్లా" స్వర్ణ అనంత"

"స్వర్ణ అనంతపురం" లక్ష్యంగాశాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలను మంత్రి అభినందించారు. మహిళల భద్రత, గంజాయి కట్టడి, సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న పోలీసు యంత్రాంగానికి ప్రశంసలు తెలిపారు.ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకర్లు, మీడియా, ప్రజల సమన్వయంతో అనంతపురం జిల్లాను "స్వర్ణ అనంతపురం"గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు సహకరించాలని కోరారు.అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను మంత్రి సన్మానించారు. విశిష్ట సేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

---

# స్వాతంత్ర్య వేడుకల్లో అధికారులకు పురస్కారాలు



డాక్టర్ సాగి పద్మశ్రావణి, అసోసియేట్ ప్రొఫెసర్ మెడికల్ కాలేజ్ అనంతపురం.



వి ఎన్. పూజిత అకౌంటెంట్ డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీస్ అకౌంటెంట్ కలెక్టరేట్ అనంతపురం



వి. గిరిబాబు డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ అనంతపురం.

**అనంతపురం సంక్షేమం , ఆగస్టు 15,(రిపబ్లిక్ న్యూస్):**
80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన పలువురు అధికారులకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. అనంతపురం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో భాగంగా సేవలను గుర్తించి వారికి అవార్డులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా అనంతపురం ఐ ఎన్ పి ఆర్ ఏ డి బాలకొండయ్య, అనంతపురం మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాగి పద్మశ్రావణి, అనంతపురం జిల్లా ట్రెజరీ కార్యాలయ అకౌంటెంట్ వి.ఎన్. పూజిత, అనంతపురం డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ వి. గిరిబాబు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆర్ఎంఓ హేమలత, డ్రిప్ ఇరిగేషన్ పిడి రఘునాథరెడ్డి, వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ శైలజ, డిపిఓ నాగరాజు నాయుడు, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్ లకు మంత్రి పయ్యావుల కేశవ్ పురస్కారాలు అందజేసి అభినందించారు. ప్రభుత్వ సేవల్లో అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న అధికారులు, సిబ్బందిని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గుర్తించి సత్కరించడం ద్వారా వారి సేవలకు తగిన ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు. పురస్కారాలు అందుకున్న వారు తమకు అప్పగించిన బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వర్తించేందుకు ఇది స్ఫూర్తినిస్తుందని తెలిపారు.



బాల కొండయ్య, ఐ అండ్ పి ఆర్ , ఏడి అనంతపురం

---

# దేశాభివృద్ధిలో విద్యార్థులదే కీలక పాత్ర

### శ్రీ చైతన్య ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్ భాను




**అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 15,(రిపబ్లిక్ న్యూస్):**
దేశాభివృద్ధిలో విద్యార్థులదే కీలక పాత్ర అని శ్రీ చైతన్య ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్ భాను అన్నారు. ఈ సందర్భంగా నగరంలోని శ్రీ చైతన్య పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**మహనీయుల చిత్రపటాలకు ఘన నివాళులు:పర్వీన్ భాను**

జాతీయ భావాన్ని చాటేలా పాఠశాల ప్రాంగణాన్ని ముస్తాబు చేసి, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఉదయం 9 గంటలకు ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్ భాను జాతీయ జెండాను ఆవిష్కరించగా.. విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు.అంతకుముందు స్వాతంత్ర్య సమరయోధులు, జాతి కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి సేవలను స్మరించుకుంటూ విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలపించారు. స్వాతంత్ర్య ఉద్యమం, దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రతిబింబించేలా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ వేషధారణలు, దేశభక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

**వారి త్యాగాలు ఫలితంగానే స్వేచ్ఛగా జీవిస్తున్నాం**

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్ భాను మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎంతోమంది మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. వారి త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని అన్నారు. అమరవీరుల త్యాగాలను భావితరాలు ఎప్పటికీ మరువకూడదని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.



**విద్యతో పాటు దేశభక్తి, విలువలు అలవర్చుకోవాలి**

విద్యార్థులు దేశ భవిష్యత్తుకు ప్రతినిధులని, నేటి విద్యార్థులే రేపటి దేశ నిర్మాతలని పర్వీన్ భాను పేర్కొన్నారు. విద్యతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. చదువులో ప్రతిభ చూపడంతో పాటు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించి దేశ ప్రగతికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. విద్యార్థులు భవిష్యత్తులో ఏ రంగాన్ని ఎంచుకున్నా నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేస్తూ దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. జాతీయ ఐక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వ భావాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ తిరుమలేశ్వర్ రెడ్డి, సుధామణి, కోమలి, మాధవి,నీరజ్, శశికళ, రామ్మోహన్, జకీరా,జానకి, రమాదేవి, పూర్ణిమ,షబానా, షైనా తదితరులు పాల్గొన్నారు.

---

# కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 15)**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలు, త్యాగాలను కలెక్టర్ స్మరించుకున్నారు. వారి త్యాగాల స్ఫూర్తితో ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, సిబ్బంది



సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ మరింత సమర్థవంతంగా చేరేలా కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో కలెక్టర్ క్యాంప్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**గుత్తి, ఆగస్టు 15: (రిపబ్లిక్ న్యూస్)**



గుత్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తిని చాటుకున్నారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి. జబ్బర్ మియా మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పట్టణ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సేవలు అందించేందుకు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎం.కె. చౌదరి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, రమేష్, రాజా, మున్సిపల్ డీఈ హేమచంద్ర మేనేజర్ రాంబాబు, డి. ఈ. , ఏ. ఈ లు గోవిందప్ప , హరికిరణ్ , శానిటరీ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి , ఆర్. ఓ దాసరధి , ఆర్. ఐ లు నాగార్జున , ఫాయాజ్ అహ్మద్ , మెప్మా టి. యఎం. సి చంద్రశేఖర్ పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలులో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు ఘన సన్మానం

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి టి.జి.భరత్ పరేడ్ వీక్షించి గౌరవ వందనం స్వీకరణ





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 15)**

కర్నూలు నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టి.జి.భరత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి పరేడ్‌ను వీక్షించి, సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.



ఈ సందర్భంగా మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను సన్మానించడం ద్వారా వారి త్యాగాలను నేటి తరానికి గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను మంత్రి టి.జి.భరత్, జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో గుర్రం జైపాల్‌రెడ్డి, ఎస్. ఉమాదేవి, జి. సుబ్బమ్మ, ఎం.సి. ఎంకమ్మ, ఎస్.డి. నరేంద్ర ప్రసాద్, డి. రాధాకృష్ణమూర్తి, ఎస్.ఐ. భాష బియాబాని, కల్నల్ ఐ.ఎస్. సయీద్, కే. చంద్రకాంత్, విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయ విఠల పాఠశాలలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**చిప్పగిరి ఆగస్టు 15 (రిపబ్లిక్ న్యూస్)**



మండల కేంద్రమైన చిప్పగిరిలోని విజయ విఠల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను కరెస్పాండెంట్ కిష్టపాడు యూసుఫ్, ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సమక్షంలో దేశభక్తి భావాలను చాటుకున్నారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ముందుగానే విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బహుమతులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తితో పాటు పోటీతత్వం, క్రమశిక్షణ, ఐక్యత వంటి విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, వివిధ రకాల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల ఉత్సాహభరితమైన నృత్య ప్రదర్శనలతో పాఠశాల ఆవరణమంతా సందడిగా మారింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఆసక్తిగా తిలకించి అభినందించారు. ఇటీవల నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విజయ విఠల పాఠశాల విద్యార్థులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు అనంతరం స్వాతంత్ర దినోత్సవం యొక్క ప్రాముఖ్యత, దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలు, దేశ పౌరులుగా విద్యార్థుల బాధ్యతల గురించి తోటి విద్యార్థులకు వివరించారు. దేశ సమగ్రత, ఐక్యతను కాపాడటంతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని వారు సూచించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ కిష్టపాడు యూసుఫ్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకునే పవిత్రమైన రోజని అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు పాఠశాలలో సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే పాఠశాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన రోప్ స్కిప్పింగ్ విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలు విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను చాటుకునే వేదికగా నిలిచాయి.

## కేంద్రీయ విద్యాలయంలో మిన్నంటిన దేశభక్తి

### విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 15)**

పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం, కర్నూలులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పాయల్ ప్రియదర్శిని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు.

వందే మాతరం, జాతీయ గీతం, జెండా గీతం ఆలాపనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలు, సమూహ నృత్యాలు, సోలో నృత్యం, కవితా పఠనం, ప్రసంగాలు, నాటికలతో ఆకట్టుకున్నారు. 'భిన్నత్వంలో ఏకత్వం' అంశంపై ప్రదర్శించిన నాటిక జాతీయ సమైక్యత, సామరస్యం, పరస్పర గౌరవం సందేశాన్ని చాటిచెప్పింది. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల నృత్య ప్రదర్శన సమగ్రత, సమానత్వానికి ప్రతీకగా నిలిచింది. 'కదమ్ కదమ్ బఢాయే జా' మార్చింగ్ ఆంథమ్‌తో విద్యార్థులు ఉత్సాహాన్ని నింపారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో నిర్వహించిన ర్యాంప్‌వాక్ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పాయల్ ప్రియదర్శిని మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించి, ప్రకృతి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఆహ్వానిత అతిథులు, సహాయక సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ గర్వాన్ని చాటారు.

## ఆగస్టు 18న కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ కలెక్టర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ



**ఓర్వకల్ ప్రతినిధి, ఆగస్టు 15 (రిపబ్లిక్ న్యూస్)** ఈరోజు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 18న కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఓర్వకల్ మండలంలోని కొత్త బస్టాండ్ నుంచి ఓర్వకల్ మండల ఎమ్మార్వో ఆఫీస్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ బైక్ ర్యాలీకి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప పాల్గొని జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించడం జరిగింది.. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ ఆగస్టు 18న కర్నూలు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ కర్నూలు జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అదేవిధంగా ధరల పెరుగుదలను అరికట్టాలి. జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలి. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి. ఓర్వకల్ మండలంలో పంట వేసి నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు 50 వేల రూపాయలు పంట నష్టపరిహారం ఇవ్వాలి. అదేవిధంగా పరిశ్రమల్లో భూములు కోల్పోయిన రైతులకు ఉపాధి కల్పించాలి. పరిశ్రమల్లో స్థానికంగా ఉన్నటువంటి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని అనేక డిమాండ్లతో బైక్ ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రమేష్ సహాయ కార్యదర్శి సుధాకర్ రైతు సంఘం మండల అధ్యక్షులు సుధాకర్, వలి, మహబూబ్ బాషా, చిన్న సిపిఐ నాయకులు రాజు కన్నా, మౌలాలి తదితరులు పాల్గొనడం జరిగింది



## శకునాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు







**ఓర్వకల్ ప్రతినిధి, ఆగస్టు 15 (రిపబ్లిక్ న్యూస్)**

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని శకునాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని కమతం సునీత త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవ సందేశాన్ని అందించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్.ఎం.సి చైర్మన్ మదన్, గ్రీన్ కో లోకల్ యూనిట్ ప్రతినిధి బాద్షావలి శివ ప్రసాద్, జనార్దన్ రెడ్డి, ఆశాదీప్ ప్రతినిధి సాదిక్ దాతలు జి. ఉమామహేశ్వరయ్య, నె మలయ్య, మురలీధర్ రెడ్డి, చిన్నయ్య, తదితరులు పాల్గొని విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవ సందేశాలను వినిపించారు. కార్యక్రమంలో బాద్షావలి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అందుకు ఇప్పటినుండి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలని కోరారు. ఉన్నత శిఖరాలను అధిరోహించిన విద్యార్థులు తమ తోటి వారికి సహాయం చేయగల గుణాన్ని అలవర్చుకోవాలని కోరారు. మరో గ్రీన్ కో ప్రతినిధి శివ ప్రసాద్ మాట్లాడుతూ గ్రీన్కో ఆధ్వర్యంలో పాఠశాలకు కావలసిన మౌలిక వసతులను, విద్యార్థులు చదువులో రాణించేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తున్నామని.. విద్యార్థులు మంచి మార్కులను సాధించి తమ పాఠశాలకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో గత ఏడాది పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రీన్ కో ఆర్థిక సహకారంతోపాటు దాతలు జీ ఉమామహేశ్వరయ్య ఎన్. నెమలయ్య, మురలీధర్ రెడ్డి, చిన్నయ్యలతోపాటు వివిధ సబ్జెక్టులకు చెందిన ఉపాధ్యాయులు నగదు బహుమతులను అందజేశారు. అనంతరం క్రీడా పోటీల విజేతలకు మెడల్స్ ను బహుకరించి సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు గజేంద్రుడు, ప్రసాద్ రెడ్డి, కృష్ణప్ప, రత్న కుమార్, సుమిత్ర పాల్,శ్రీనివాసులు, ఖాజా పర్వేస్, విజయశ్యామల, కుమారమ్మ,ప్రసన్న లక్ష్మి, జయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎంఎండి భాష,నరసింహులు పాల్గొన్నారు.

# నంద్యాలలో ఘనంగా 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు



### పరేడ్ మైదానంలో వైభవంగా స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

### నంద్యాల పరేడ్ మైదానంలో దేశభక్తి సందడి అలరించిన శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 15 (రిపబ్లిక్ న్యూస్):**
శనివారం ఉదయం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరేడ్ మైదానంలో 80 వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్రీయ సెల్యూట్ స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల ప్లాటూన్లు క్రమశిక్షణతో మార్చ్‌పాస్ట్ నిర్వహించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మార్కెట్ యార్డ్ చైర్మన్ హరిబాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్, జిల్లా స్థాయి అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ జిల్లాభివృద్ధిపై సందేశమిస్తూ సూపర్‌సిక్స్ హామీల్లో అత్యంత కీలకమైన 'అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం' ద్వారా ఏడాదికి రూ.20వేలను అర్హులైన రైతులకు అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా 2026-2027 ఆర్థిక సంవత్సరంలో నంద్యాల జిల్లాలో 2 లక్షల 6 వేల 52 మంది రైతుల ఖాతాల్లో 139 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగిందన్నారు. 2026 ఖరీఫ్ సీజన్ కు రూ.4,204 కోట్ల ఆర్థిక లక్ష్యానికి గాను ఇప్పటివరకు రూ.853 కోట్ల రూపాయల పంట రుణాలను 1,83,223 మంది రైతులకు అందించాం. తల్లికి వందనం పథకం కింద 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున జిల్లాలోని 2 లక్షల 75 వేల 394 మంది విద్యార్థుల తల్లుల మరియు సంరక్షకుల ఖాతాల్లో రూ.358 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగిందన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటివరకు




జిల్లాలో 3.51 కోట్ల మంది మహిళా ప్రయాణికులు, ట్రాన్స్ జెండర్లు మరియు 2.66 లక్షల మంది దివ్యాంగ ప్రయాణికులకు రూ.138 కోట్ల రూపాయల మేర లబ్ధి చేకూర్చామన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జిల్లాలో 2 లక్షల 10 వేల 221 మందికి 91 కోట్ల 64 లక్షల రూపాయలను ప్రతినెల 1వ తేదీన ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నామన్నారు. మనమిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో సుమారు 1000కు పైగా పౌరసేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి వచ్చే నీటిని సాగునీటికి కాకుండా కేవలం త్రాగునీటి అవసరాలకే వినియోగించాలని, వరి పంటకు బదులుగా తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేసారు.సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం మరియు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకాల ద్వారా రూ.12.45 కోట్ల వ్యయంతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. జలధార జలహారతి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చెరువులు, కాలువలు, నీటి వనరుల పునరుద్ధరణకు పెద్దపీట వేశాం. జిల్లాలోని 29 మండలాల్లో 2,103 పనులను చేపట్టి, 2044 పనులుఎ పూర్తి చేయడం జరిగిందన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో 'క్యాచ్ ది రైన్' ప్రచారం కింద నంద్యాల జిల్లాలో చేపట్టిన జల సంరక్షణ కార్యక్రమాలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ప్రశంసించడం జిల్లా యంత్రాంగానికి గర్వకారణం మంత్రి తెలిపారు జల జీవన్ మిషన్ పథకం కింద శాశ్వత నీటి సరఫరా కోసం గ్రామీణ ప్రాంతాలలో 109 కోట్ల రూపాయలతో చేపట్టిన 419 పనులకు పరిపాలన ఆమోదం లభించగా ఇప్పటి వరకూ 197 పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మైనారిటీల సంక్షేమం, వారి సామాజికఆర్థిక అభివృద్ధితో పాటు మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది. ఈ ఏడాది పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 5,076 మంది మైనారిటీ విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం కింద రూ.6.55 కోట్లను వారి తల్లుల ఖాతాల్లో జమ చేశామన్నారు. అలాగే, 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల కింద 31,675 మంది మైనారిటీ లబ్ధిదారులకు రూ.13.85 కోట్లను అందించి వారి ఆర్థిక భద్రతకు ప్రభుత్వం అండగా నిలిచాం. అలాగే 3,056 మందికి దీపం కనెక్షన్లను ఉచితంగా అందజేశాం.జిల్లాలో ఉన్న 7 నైపుణ్య శిక్షణా కేంద్రాల ద్వారా నిరుద్యోగ యువతీ యువకులలో నైపుణ్యాలు పెంచి జాబ్ మేళాల ద్వారా ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకూ 6 నియోజకవర్గాలలో 74 జాబ్ మేళాలు నిర్వహించి 7,139 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకూ రూ.143 కోట్ల రూపాయలను ఖర్చు చేసి 69,762 మందికి ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా వైద్య చికిత్సలు అందించడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల నుండి 102 తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాల ద్వారా 12,350 తల్లి బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చామన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా అభివృద్ధి పథంలో పయనించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో 7 కోట్ల 55 లక్షల రూపాయల పెట్టుబడితో స్థాపించిన 42 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ద్వారా 307 మందికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలోని 5 లక్షల 49 వేల 122 మంది తెల్ల రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. దీపం-2 పథకం కింద ఇప్పటి వరకూ 4 లక్షల 4 వేల 670 మంది లబ్దిదారులకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణి చేయడం జరిగిందన్నారు. రూ.146 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని గ్యాస్ వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసాం. వి.బి.జి రామ్.జి. పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 22 వేల 221 ఫారంపాండ్లు, 2,221 చెక్ డ్యాంలు, 202 పర్కులేషన్ ట్యాంకులను బలోపేతం చేయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం, భూగర్భ జలాల పునరుత్పత్తి గణనీయంగా పెరుగుతోందన్నారు. జిల్లాలో 293 గ్రామాల్లో రీ-సర్వే పూర్తికాగా, 230 గ్రామాలకు సంబంధించి 1,47,031 పట్టాదారు పాస్ పుస్తకాల్లో 1,35,560 పాస్ పుస్తకాల ముద్రణ పూర్తయిందని, మిగిలిన పాస్ పుస్తకాల ముద్రణను వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో 230.25 కి.మీ. జాతీయ రహదారి ప్రాజెక్టులకు భూములు కోల్పోయిన రైతులకు రూ.373.92 కోట్ల నష్టపరిహారం చెల్లించామన్నారు. ప్రస్తుతం ఉన్న ఆరు ప్రాజెక్టులకు అదనంగా ఎన్‌హెచ్ - 544డి కేటాయింపు జిల్లా అభివృద్ధికి మరింత ఊతమిస్తోందన్నారు. సోలార్ పవర్ సంస్థల అభివృద్ధికి అభివృద్ధికి 12,519 ఎకరాలు, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు 102 ఎకరాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టులకు 317 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం శ్రీశైల దేవస్థానం, వ్యవసాయ, ఉద్యాన, డిఎంహెచ్వో, విద్యాశాఖ, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపాలిటీ, హౌసింగ్, వాటర్ రిసోర్సెస్, డ్వామా, డిఆర్డిఏ, డిపిఓ, కోఆపరేటివ్, ఐసిడిఎస్, ఏపీఎస్పీడీసీఎల్, ఇండియన్ రెడ్ క్రాస్, పర్యాటకం శక్తి టీం ఆర్టీవో తదితర శాఖలు ప్రదర్శించిన శకటాల ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ పనితీరు కనపరిచిన అధికారులు, ఉద్యోగులకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు ప్రశంసా పత్రాలను మంత్రి, కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు

## మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగి మరికొందరికి ఉపాధి కల్పించాలి**

**నంద్యాల పురపాలక పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి, ఆహారం అందించాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**







**నంద్యాల బ్యూరో, ఆగస్టు 15 (రిపబ్లిక్ న్యూస్):**
స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్య్రం కోసం నాటి తరం చేసిన త్యాగాలు, పోరాటాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉపాధి, పారిశ్రామిక, సాంకేతిక తదితర అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుత సంవత్సరం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు, ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. వ్యవసాయం, తాగునీటి సరఫరా వంటి అంశాల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. "ఒక కుటుంబంలో ఒక వ్యవస్థాపకుడు" అనే లక్ష్యంతో మహిళలను స్వయం ఉపాధి, జీవనోపాధి కార్యక్రమాల ద్వారా ఎంటర్‌ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడంతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ( ఎమ్మెస్ ఎంఈ లు) అభివృద్ధి చెంది కుటుంబ ఆదాయం, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. నంద్యాల పురపాలక పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన గాలి, నాణ్యమైన ఆహారం, ఆహ్లాదకరమైన వాతావరణం అందేలా అధికారులు నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. పారిశుద్ధ్యం, పచ్చదనం, ప్రజారోగ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలన్నారు. ప్రజల్లో మున్సిపాలిటీపై విశ్వాసం, సానుకూల దృక్పథం పెంపొందించేలా అధికారులు సేవా భావంతో పనిచేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. నిరుపేదలు, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా అందించడంతో పాటు, ప్రజల సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. రైతులకు సమృద్ధిగా పంటలు పండి, వ్యవసాయం అభివృద్ధి చెందాలని, నంద్యాల జిల్లా అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తూ అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే స్వాతంత్య్ర స్ఫూర్తికి నిజమైన ప్రతిరూపం

**ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజాసేవలో మరింత బాధ్యత ఉంది**

**జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్**






**నంద్యాల బ్యూరో, ఆగస్టు 15 (రిపబ్లిక్ న్యూస్):**
స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నంద్యాల కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి అధికార బదలాయింపు జరిగి, దేశం స్వాతంత్య్రం పొందిన చారిత్రక దినం ఆగస్టు 15 అని పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు, వారు దేశ స్వేచ్ఛ కోసం చేసిన పోరాటాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. స్వాతంత్య్రం సాధించేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని అన్నారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రజలు తమ అవసరాలు, సమస్యల పరిష్కారం, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రభుత్వంపై, ప్రభుత్వ ఉద్యోగులపై గణనీయంగా ఆధారపడుతున్నారని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా, పారదర్శకంగా, సకాలంలో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందన్నారు. దేశం, రాష్ట్రం అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగులు తమ వంతు బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. స్వాతంత్య్ర దినోత్సవం కేవలం వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా, మన బాధ్యతలను మననం చేసుకునే సందర్భంగా భావించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ వ్యవస్థలో, సమాజంలో ఉన్న లోపాలను నిరంతరం అధిగమిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించగలగడమే స్వాతంత్య్ర స్ఫూర్తికి నిజమైన అర్థమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, సుపరిపాలన, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేస్తూ జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com

# పాణ్యం సర్కిల్  పోలీసు శాఖ అవార్డు



**పాణ్యం ప్రతినిధి, ఆగస్టు 15, (ప్రజా రిపబ్లిక్ న్యూస్).** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు శాఖ.అవార్డుల్లో పాణ్యం సర్కిల్ పరిధిలోని గడివేముల, పాణ్యం మండలాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో విశేష సేవలు అందించిన సర్కిల్ ఇన్స్పెక్టర్  వి.కిరణ్ కుమార్ రెడ్డిఉత్కృష్ట సేవా పథకం అవార్డు దక్కింది.రెండు మండలాల్లో నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళా భద్రతా కార్యక్రమాలు, ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించడంలో ఆయన చూపిన చొరవను ప్రభుత్వం గుర్తించింది.15 ఆగస్టున నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ చేతుల మీదుగా సి ఐ కిరణ్ కుమార్ రెడ్డి  ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడివేముల, పాణ్యం మండల ప్రజల సహకారంతోనే ఈ గుర్తింపు సాధ్యమైంది. ముమ్మందు కూడా నేర రహిత సమాజం కోసం మరింత కృషి చేస్తాం“ అని తెలిపారు.అవార్డు రావడంతో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు

## చిప్పగిరి మండల  ఇన్స్ట్రక్టర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

### స్కూల్ అసిస్టెంట్ హిందీ పోస్టులు-3

### సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు పోస్టులు -18

**మండల విద్యాశాఖ అధికారి సావిత్రమ్మ**



చిప్పగిరి, ఆగస్టు, 15, (రిపబ్లిక్ న్యూస్) చిప్పగిరి మండల అకాడమీ ఇన్స్ట్రక్టర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి సావిత్రమ్మ శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లను మొత్తం 21 పోస్టులు ఉన్నాయి అని,అందులో స్కూల్ అసిస్టెంట్లు 3 పోస్టులు, మరియు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 18 పోస్టులు, నియమించడానికి ప్రభుత్వ అనుమతి మంజూరు చేసిందని, స్కూల్ అసిస్టెంట్లకు 12,500 సెకండరీ గ్రేడ్ అసిస్టెంట్లకు 10 వేలు గౌరవ వేతనం వస్తుందని,తెలియజేశారు

**గ్రామాల వారీగా స్కూల్ అసిస్టెంట్లు 3 పోస్టులు**

నగరడోన హిందీ- 1ఏరూరు హిందీ -1దేగులహల్ హిందీ -1గ్రామాల వారిగా సెకండరీ గ్రేడ్ **ఉపాధ్యాయుల పోస్టులు మొత్తం 18** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నగరడోన -1

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రామదుర్గం-1 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కుందనగుర్తి -1మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల బెల్డోన -3మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఏరూరు-5మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దేగుల హల్ -1మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గుమ్మనూరు -1మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఖాజీపురం- 2 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బంటనహాళ్ -2మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దౌల్తాపురం-1ఆసక్తి గల అభ్యర్థులు తమ యొక్క అప్లికేషన్లు ఆగస్టు 16 నుండి 21వ తేదీ వరకు చిప్పగిరి మండల విద్యాశాఖ కార్యాలయం నందు ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారి సావిత్రమ్మ తెలిపారు.

# వైద్య సేవలు అందించడం ఓ వరం

### పత్తికొండ సబ్ యూనిట్ మలేరియా నివారణ అధికారి వెంకటేశ్వర్లు

### మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ ఏ.సిరి చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రం



**చిప్పగిరి, ఆగస్టు, 15, (రిపబ్లిక్ న్యూస్)** ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్యులుగా నిస్వార్థమైన సేవలు అందించడం ఓ వరమని పత్తికొండ సబ్ యూనిట్ మలేరియా నివారణ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్తు సునయన ఆటో డైరీయం లో ఉత్తమ వైద్య సేవలు అందించినందుకు గాను ప్రభుత్వం గుర్తించి మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ ఏ. సిరి చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ ప్రశంస పురస్కారం పత్రాన్ని అందుకున్నందుకు చాలా ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా ప్రజలకు అందుబాటులో ఉండి నా పరిధిలో ఉన్న ఆరోగ్య సేవలను మరింత చురుకుగా అందించుటకు కృషి చేస్తానన్నారు.  ఉత్తమ ప్రశంస పత్రం అందుకున్న మలేరియా నివారణ అధికారి వెంకటేశ్వర్లకు తోటి వైద్య అధికారులు, స్నేహితులు, బంధువులు అభినందించి ఇలాంటి ప్రశంస అవార్డుల ను మరిన్ని పొందాలని ఆకాంక్షించారు.

## అవార్డులు ప్రశంషా  పత్రాలు పొందిన ప్రభుత్వ ఉద్యోగులు







**ఆళ్లగడ్డ ఆగష్టు. 15 రిపబ్లిక్ న్యూస్** 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా కేంద్రం లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ ఎం డి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ గనర్ చేతుల మీదుగా చాగలమర్రి తహసీల్దార్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ ఓబుళం. మౌనిక ఉత్తమ అవార్డు ప్రశంషా పత్రం అందుకున్నారు, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ సెక్రటరీ సురేష్ ఉత్తమ అవార్డు ప్రశంషా పత్రం అందుకున్నారు, ఆళ్లగడ్డ పట్టణ ఏ ఎస్ ఐ జయతీర్థ ఉత్తమ సేవ అవార్డు అందుకున్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.



**ఆళ్లగడ్డ ఆగష్టు. 15 రిపబ్లిక్ న్యూస్**

ఆళ్లగడ్డ పట్టణం లోని బాలాజీ వీధిలో వున్న 15వ అంగన్వాడీ సెంటర్లో అంగన్వాడీ వర్కర్ జి. అరుణకుమారి, హెల్పర్ జయలక్ష్మి 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి అంగన్వాడీ కేంద్రం లోని చిన్న పిల్లలు సంతోషం తో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు ఉదయం 8 గంటలకే  పిల్లలందరూ స్నానాలు చేసి మంచి కొత్త బట్టలు వేసుకొని జాతీయ జెండాను చేత పట్టుకొని సంతోషంగా అంగన్వాడీ కేంద్రం వద్దకు చేరుకొన్నారు  పిల్లల తల్లి తండ్రులు కూడా భారత దేశమంతా ఎంతో సంతోషంతో, ఆనందంతో జెరుపుకుంటున్న ఈ జెండా పండగలో తమ పిల్లలు కూడా పాల్గొనాలనే సకల్పంతో వారి పిల్లలను అందంగా ముస్తాబు చేసి అంగన్వాడీ కేంద్రం వద్దకు తీసుక రావడమే కాకుండా వారి పిల్లల చేత జాతీయి జెండాను పట్టించి వారికి ఫొటోలు తీస్తూ ఆ చిన్న పిల్లల చేతిలో భారత దేశానికి గర్వకారణమైన జాతీయ జెండాను చూస్తూ ఆనందంతో 80వ స్వాతంత్రదినోత్సవ వేడుకలను జరుపుకున్నారు.

# మహనీయుల త్యాగాలను ఎప్పటికీ మరువబోం

### లా కళాశాల చైర్మన్ ఆలూరు రామిరెడ్డి






**అనంతపురం, ఆగస్టు 15: (రిపబ్లిక్ న్యూస్)**
భారత స్వాతంత్రోద్యమంలో ప్రాణ త్యాగాలను చేసిన మహనీయులను ఎప్పటికీ మరువమని విజయనగర లా కళాశాల చైర్మన్ ఆలూరు రామిరెడ్డి  పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న “విజయనగర లా“ కళాశాలలో  80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ ఆలూరు రామిరెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేంద్ర చారి, వైస్ ప్రిన్సిపాల్ మహేష్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులు  దేశభక్తి గీతాలాపన చేశారు. కళాశాల ప్రాంగణంలో  జాతీయ జెండా కు గౌరవ వందనం చేశారు.

**దేశ ప్రగతిలో యువత కీలక పాత్ర పోషించాలి**

ఈ సందర్భంగా చైర్మన్ ఆలూరు రామిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన ప్రాణ త్యాగాలను నేటి యువత ఎప్పటికీ మరువరాదన్నారు. దేశ ప్రగతిలో యువత కీలక పాత్ర పోషించాలని, విద్యతో పాటు సామాజిక బాధ్యతను కూడా అలవర్చుకోవాలని సూచించారు.

**ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి : సిద్ధార్థ రెడ్డి**




అనంతరం  విద్యార్థి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం అంటే కేవలం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందడం  కాదని, ప్రతి పౌరుడు తన హక్కులు, బాధ్యతలను తెలుసుకుని దేశ నిర్మాణంలో భాగస్వామి కావడమే నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తి అని పేర్కొన్నారు. యువత దేశ భవిష్యత్తుకు కీలకమని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని సూచించారు. ముఖ్యంగా న్యాయ శాస్త్ర విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో సమాజంలోని అణగారిన వర్గాలకు న్యాయం అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు న్యాయ విద్యార్థులు ముందుండాలన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, న్యాయ విద్యార్థులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# ఆళ్లగడ్డలో  రెపరెప లాడిన జాతీయ జెండా

### డి ఎస్ పి శ్రీనివాసరావు తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి మున్సిపల్ కమిషనర్ కిషోర్ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు.







**ఆళ్లగడ్డ ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ పట్టణం లోని అన్ని ప్రభుత్వ ఆఫీసులలో, ప్రైవేట్ స్కూల్స్ లో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి ఉదయం 8గంటలకే ఆళ్లగడ్డ సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో డి ఎస్ పి శ్రీనివాసరావు జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్ నందు టౌన్ సి ఐ  నాగరాజారావు జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ వేడుకలలో టౌన్ ఎస్ ఐ పీరయ్య, రామకృష్ణారెడ్డి, ఏ ఎస్ ఐ శ్రీనివాస గౌడ్, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, హోమ్ గౌర్డులు పాల్గొని జాతీయ జెండాకు షాల్యూట్ చేశారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి జాతీయ జెండాను ఎగురవేశారు ఈ జెండా పండుగలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్ ఐ, వి ఆర్ ఓ లు, సెర్వేయర్లు, వి ఆర్ ఏ లు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం లో మున్సిపల్ కమిషనర్ కిషోర్ జాతీయ జెండాను ఎగురవేశారు. జెండా వందన కార్యక్రమంలో స్థానిక టి డి పి నాయకులు శేకర్ రెడ్డి, నాగంజి, మున్సిపల్ అధికారులు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు. ఆళ్లగడ్డ లోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డి ఎస్ పి శ్రీనివాసరావు, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, మున్సిపల్ కమిషనర్ కిషోర్ మాట్లాడుతూ దేశం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యత కలిగి ఉండాలని. దేశ సేవ చేయాలనే కృత నిచ్చయంతో దేశం పట్ల ప్రేమ కలిగి ఉండాలని. జాతీయ సమగ్రత కలిగి ఉండాలని దేశం పట్ల గౌరవం పెంపొందించుకోవాలని.ప్రతి ఒక్కరూ దేశం మనకేమి ఇచ్చింది అని కాకుండా దేశానికి మనమేమి ఇచ్చాం అని బాధ్యత తో మెలగాలని. దేశ నాయకుల పట్ల గౌరవం కలిగి జీవించాలని. మనకు స్వాతంత్రం తెచ్చిన స్వాతంత్ర సమరయోధులను గుర్తు చేసుకుంటూ వారి త్యాగాన్ని గుర్తుంచుకోవాలని.అప్పుడే మనం మన దేశం పట్ల బాధ్యత కలిగి ఉంటామని అన్నారు.

## కె పి జి స్కూల్లో స్వాతంత్ర వేడుకలు



**ఆళ్లగడ్డ ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్**
80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల లోని కే పి జి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ హెచ్ పి ఎం హై స్కూల్ పాఠశాలలో ముఖ్య అతిథిగా ఆళ్లగడ్డ మండలం డెవలప్మెంట్ ఆఫీసర్  నూర్జహాన్ జాతీయ పతాకం ఎగరవేశారు ఈ కార్యక్రమంలో అపుస్మ ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ అధ్యక్షులు టి అమీర్ భాష, పడకండ్ల రామకృష్ణారెడ్డి,హెచ్ పి ఎం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామచంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, కరస్పాండెంట్ సోమశేఖర్, కే పి జి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రఫీ, ఉపాధ్యా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి ఏకపాత్రాభినయం మరియు పిల్లల వేషధారణ సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి స్వాతంత్ర్య సమరయోధులను పేరుపేరునా స్మరించి నివాళు లర్పించారు.

## సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు లో  జెండా కు వందనం



**ఆళ్లగడ్డ ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు లో సబ్ రిజిస్ట్రార్ చైతన్య రాయల్ జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఎందరో నాయకులు చేసిన మహోన్నత త్యాగముతో ఈ దినం మనం స్వతంత్ర ఫలాలు పొంది జీవనం సాగిస్తున్నాము అని దేశంలోని నాయకులు ప్రజాప్రతినిధులు అన్ని రాష్ట్రాల నాయకులు ప్రజాప్రతినిధులు ప్రజల మేలుకొరకు ఎంతో సేవ చేసినారు,ఇంకా ఎంతో మేలు చేయడానికి ప్రజలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి దేశ నాయకులు ప్రజాప్రతినిధులు అన్ని రాష్ట్రాల నాయకులు ప్రజాప్రతినిధులు చేస్తున్న కృషి అభినందనీయం అని తెలిపారు, ప్రతి ఒక్కరూ దేశ భక్తని పెంపొందించుకోవాలని అందరూ జాతి సమైక్యతకు కృషిచేయాలనీ కోరుకుంటూ అందరికీ. 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు .ఈ కార్యక్రమం లో సబ్ రిజిస్టర్ ఆఫీస్ అధికారులు, స్టాంప్ రైటర్స్ జేబులున్ రాజేంద్ర ప్రసాద్, గురుమూర్తి, బాషా, తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ఆర్ హైస్కూల్లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, సీఐ వేణుగోపాల్, ఎంఈఓ ఉస్మాన్ భాష చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరణ





**దేవనకొండ ఆగస్టు 15 (ప్రజా రిబ్లిక్ న్యూస్) : :-**
మండల కేంద్రమైన దేవనకొండలోని ఎఫ్ఆర్ హైస్కూల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, సీఐ వేణుగోపాల్ జాతీయ జెండానుఆవిష్కరించారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి ఎస్. ఉస్మాన్ భాష అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను విద్యార్థులకు వివరించారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవిస్తున్నామని తెలిపారు. దేశభక్తి, క్రమశిక్షణ, బాధ్యతతో విద్యార్థులు దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.
పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉచీరప్ప తెలిపారు.మండల టాపర్లకు సన్మానం గత మార్చి నెలలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు ఈ సందర్భంగా మెమెంటోలు, వెండి పతకాలను అందజేసి ఘనంగా సత్కరించారు. విద్యార్థుల ప్రతిభను అభినందించిన ప్రముఖులు, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో దేవనకొండ సింగిల్ విండో అధ్యక్షులు రాజశేఖర్, శాంతికుమార్, బంక షేకన్న, సదాశివరావు, రాజగోపాల్ గౌడ్ తదితరులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

## త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి మరియు మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి వర్యులు వివేక్ వెంకట స్వామి






**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 15**
మెదక్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగారాష్ట్ర మంత్రి వివేక్ వెంకట స్వామి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మీదట, పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని నివేదిస్తూ, ప్రజనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపేలా ఏర్పాటు చేసిన



స్టాళ్లను సందర్శించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక, అటవీ, విద్యా, వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమం, మిషన్ భగీరథ, నీటి పారుదల, సమగ్ర శిక్ష అభియాన్ తదితర శాఖల ఫోటో ఎగ్జిబిషన్ స్టాల్స్ ను సందర్శించారు. . ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. పతకాలు పొందిన పోలీసులకు మెడల్స్ బహూకరించారు. స్వాతంత్ర్య సమర యోధులను, వారి కుటుంబీకులను ఘనంగా సన్మానించారు. పంద్రాగస్టు వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశ భక్తిని నింపుకుని జాతీయ స్ఫూర్తి పెంపొందేలా ఆకట్టుకునే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆహుతుల మన్ననలు అందుకున్నారు. పాఠశాలల చిన్నారులు సాంస్కృతిక గేయాలపై చక్కటి అభినయం ప్రదర్శించారు.

ఈ సందర్భంగా చిన్నారులను ముఖ్య అతిథి మంత్రి వివేక్ వెంకట స్వామి ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్



ప్రతిమా సింగ్,మెదక్ ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాయికల్ లో ఘనంగా 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు




**రాయికల్ మండలం ఆగస్టు15( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండల ఆటో ట్రాలీ టాటా ఏసీ డ్రైవర్ కార్మిక యూని సంఘం 60 మంది సభ్యులు గల యూనియన్ వారు అధ్యక్షులు ఎండి నజీర్ ఆధ్వర్యంలో80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరిపారు ఇక ఈ కార్యక్రమంలో తోపురపు ఆశన్నను ఘనంగా సత్కరించారు అతని కోడలు 1వార్డ్ కౌన్సిలర్ యూనియన్ అధ్యక్షులు ఎండి నజీర్, ఉపాధ్యక్షులు చాంద్ పాషా,క్యాషర్ దండగుల అశోక్,కార్యదర్శి ఊరేడి రాజేష్, ప్రచార కార్యదర్శి సిరాజ్, వ్యవస్థాపక అధ్యక్షులు కురు సంఘ రాజు కార్యవర్గ సభ్యులు కూడా హాజరయ్యారు అలాగే జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణములో 80,వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిపారు పట్టణములో గల మునిసిపాలిటీ, మండల రెవెన్యూ, మండల ప్రజాపరిషత్, పోలీస్ స్టేషన్, అటవీశాఖ, విద్యుత్ శాఖ, ప్రభుత్వ ఆసుపత్రి, బస్తీ దావఖాన కార్యాలయలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ ప్రాథమిక జిల్లా ప్రజా పరిషత్ బాలుర బాలికల ఉర్దూ మీడియం పాఠశాలలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిపారు ఈ కార్యక్రమాలలో ప్రభుత్వము స్వతంత్ర దినోత్సవం గురించి ముఖ్య అధికారులు ప్రసంగించారు అలాగే ప్రైవేట్ పాఠశాలలైన వివేకవర్ధిని, ప్రగతి గ్రీన్ వుడ్,విశ్వశాంతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ పాఠశాలలో వేడుకల్లో ఘనంగా జరిపారు వివిధ సంస్కృతి కార్యక్రమాలు కూడా చేపట్టారు అలాగే ఇటిక్యాల్




మైతాపూర్, అల్లీపూర్, భూపతిపూర్, కట్కాపూర్ ఒ డ్డే లింగాపూర్, కొత్తపేట్,రామాజీపేట్ గ్రామాలలో పలు గ్రామపంచాయతీ వద్ద అలాగే ప్రభుత్వ పాఠశాలలో జెండా వందనం చేశారు పలు గ్రామాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి

## అయోధ్య గ్రామ సర్పంచ్ సిరిపురం లక్ష్మి,ఉప సర్పంచ్ తాలూక రాజేశం ఆధ్వర్యంలో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు



**రాయికల్ మండలం ఆగస్టు,15( రిపబ్లిక్ న్యూస్)** జగిత్యాల్ జిల్లా రాయికల్ మండలం అయోధ్య గ్రామంలో గ్రామ పంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ సిరిపురం లక్ష్మి, ఉప సర్పంచ్ తాలూక రాజేశం ఆధ్వర్యంలో పథకావిష్కరణ చేశారు అలాగే బజార్ హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది..ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరిపురం లక్ష్మి ఉపసర్పంచ్ తాలుక రాజేష్ వార్డ్ మెంబర్స్ ఒర్రె జల, దెబ్బడి రమేష్, మింగరి సునిత మరియు యూత్ సభ్యులు కాటిపెల్లి మహేష్ రెడ్డి, దెబ్బడి శేఖర్,ఒర్రె రమేష్,గడ్డం రాజేంధర్ రెడ్డి,ముస్కు రాజేష్, గడ్డం శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రాయికల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్వతంత్ర దినోత్సవ వేడుకలలో “వీర జవాన్లు“ గా అందరిని ఆదరించిన చిన్నారులు



**రాయికల్ మండలం ఆగస్టు,15( రిపబ్లిక్ న్యూస్)**
80వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని జగిత్యాల్ జిల్లా రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చిన్నారులు వీర జవాన్లు గా అందరిని అలరించారు .స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ సమైక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం భారతదేశ సరిహద్దుల్లో ప్రతిక్షణం పహార కాస్తూ దేశ రక్షణ కవచం గా ఉన్న సైనికులకు వందనం సమర్పించారు దేశ రక్షణ లో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు . దేశభక్తి, జాతీయ సమైక్యతా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రధానోపాధ్యాయులు గట్టు రమేష్ నర్సయ్య తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బి.శాంతయ్య ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా స్థాయి ఉత్తమ తహసిల్దారు అవార్డుకు ఎంపికైన రాయికల్ తాసిల్దార్ నాగార్జునకు పలువురి శుభాకాంక్షలు




**రాయికల్ మండలం ఆగస్టు,15( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండల తాసిల్దార్ నాగార్జున ఉత్తమ తహసిల్దార్ గా ఎన్నికైనందుకు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన రాయికల్ మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజీ మహేందర్ బాబు రాయికల్ మాజీ సర్పంచ్ ఎద్దశీడి భూమరెడ్డి రాయికల్ మాజీ సింగల్ విండో అధ్యక్షులు గన్నవరం ప్రభాకర్,పడిగల రవీందర్ రెడ్డి రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కామ్ రవీందర్ వైస్ చైర్మన్ తురుగా సౌజన్య శ్రీధర్ రెడ్డి, రాయికల్ సింగల్ విండో అధ్యక్షులు ఏన్నగ మల్లారెడ్డి, రాయికల్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్ కుమార్, బిజెపి పట్టణ శాఖ అధ్యక్షుడు కురుమ మల్లారెడ్డి, మైనార్టీ నాయకులు మహమ్మద్ షంషీర్, సురకంటి రాజిరెడ్డి, గట్టు లక్ష్మీనరసయ్య,అలాగే గిరిధవర్ దాసరి పద్మయ్య మండల రెవెన్యూ సిబ్బంది ఇంటర్నేషనల్ ఉమేన్స్ రైట్స్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి మండల ప్రజా పరిషత్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేసిన వాయుపుత్ర యూత్ సభ్యులు




**మల్లాపూర్ ఆగష్టు 15 (రిపబ్లిక్ న్యూస్)**
మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో వాయుపుత్ర యూత్ ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను శనివారం యూత్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా రేగుంట జిల్లా పరిషత్, పాఠశాలలో గత సంవత్సరం పదవ తరగతి పరీక్షలో ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాలలోని ముగ్గురు విద్యార్థులకు ప్రథమ బహుమతి 5,555 ద్వితీయ 3,333 తృతీయ 2,222 చొప్పున మొత్తం 11,110 రూపాయలను విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను యూత్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు బండారి వెంకటేష్, ఉపాధ్యక్షుడు బందెల నరేష్, క్యాసియర్ మూడంపల్లి రమేష్ సభ్యులు తీట్ల రాజేష్, వేములవాడ దేవరాజం, మహమ్మద్ నజీర్, కొత్తపల్లి ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ సరస్వతి శిశు మందిర్ నిర్మాణానికి ఒక లక్ష 11,111 రూపాయలు అందించిన బిజెపి సీనియర్ నాయకులు చిలకమర్రి మదన్ మోహన్




**రాయికల్ మండలం ఆగస్టు,15( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ సరస్వతి శిశు మందిర్ నిర్మాణానికి తన వంతు విరాళంగా రూ. 1,11,111/- రూపాయలు అందించిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు చిలుకమర్రి మదన్ మోహన్, ఈరోజు జగిత్యాల జిల్లా రాయికల్ సరస్వతి శిశు మందిర్ లో జరిగిన చిలుకమర్రి పరాంకుశాచార్య సంస్మరణ సమావేశంలో ఈ విరాళాన్ని భవన నిర్మాణ కమిటీకి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మదన్ మోహన్ నాన్న కీ. శే. చిలుకమర్రి పరాంకుశాచార్య రాయికల్ శిశు మందిర్ కు అందజేసిన సేవలను గుర్తుచేసుకొని మరియు శిశు మందిర్ పునర్నిర్మాణానికి మదన్ మోహన్ అందించిన విరాళానికి ధన్యవాదాలు తెలియజేశారుఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మచ్చ నారాయణ శిశుమందిర్ అధ్యక్షులు బొమ్మకంటి రాంగోపాల్ భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు మోహన్ రెడ్డి నిర్మాణ కమిటీ సభ్యులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**రాయికల్ మండలం ఆగష్టు,15( రిపబ్లిక్ న్యూస్)**జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో హాజరై అందరినీ ఆకట్టుకున్నారు.విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించడంతో పాటు దేశభక్తి గీతాలపై ఉత్సాహంగా నృత్యాలు చేసి తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవం గొప్పతనం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశభక్తి వంటి అంశాలపై వివిధ రకాల ప్రసంగాలు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు మాట్లాడుతూ భారతదేశ గొప్పతనం, స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలు, దేశం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జూపల్లి తిరుపతిరావు, ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## ఎందరో త్యాగదనుల ప్రాణ త్యాగాలతో సిద్ధించినా భారతదేశం

### - రాయికల్ బిజెపి పట్టణ శాఖ అధ్యక్షుడు కురుమ మల్లారెడ్డి



**రాయికల్ మండలం ఆగష్టు,15( రిపబ్లిక్ న్యూస్)**
భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పటేల్ విగ్రహం వద్ద స్వతంత్ర దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం పట్టణ శాఖ అధ్యక్షులు కురుమ మల్లారెడ్డి ఆధ్వర్యంలో చేయడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చింది ఎందరో త్యాగధనుల ప్రాణాత్యాగం తో సిద్ధించిన స్వతంత్రం కులమతాలకు అతీతంగా అందరము సమానంగా ఉండాలని మనమందరం భారతీయులం అనే దృక్పథం ఉండాలని ఎ దేశానికి వెళ్లిన మన భారతీయులము అని గర్వాంగా చెప్పుకునే రోజు వచ్చింది అది మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ద్వారా జరుగుతున్న విషయాన్ని అందరూ గ్రాయించలని ఈ సందర్భంగా అన్నారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

## పి డి ఎస్ యు డివిజన్ అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్



**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జీ ఆగస్టు 15**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు జిల్లా పర్యటన సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు డివిజన్ అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్ నీ అక్రమంగా అరెస్టు చేసి సొంత పోషకతో విడుదల చేయడం జరిగింది ఎండి ఇస్మాయిల్ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని చూడటం సిగ్గు శేటు అదేవిధంగా పెండింగ్లో ఉన్న10.500 కోట్ల రూపాయలు తక్షణమే విడుదల చేయాలని 23 వేల ప్రభుత్వ స్కూల్లో మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్రంలో విద్యార్థులకు పెద్దపీట వేస్తామని చెప్పి విద్యను అభివృద్ధిలోకి తెస్తాం అని చెప్పి పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఈ ముఖ్యమంత్రి విద్యను పూర్తిగా దూరం చేయాలన్న ఆలోచనలు పరిపాలన కొనసాగిస్తున్నారు అంతేకాకుండా పెండింగ్లో ఉన్న10.500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లో రాక విద్యార్థులు ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులే స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ పై ఆధారపడి చదువుతారు వారిని విద్యకు దూరం చేయాలని చూడడం దుర్మార్గం ఏదైతే పాత పద్ధతిలో విద్యార్థులకు డబ్బులు ఇచ్చారు అదేవిధంగా కొనసాగించాలని అంతేకాకుండా రాష్ట్రంలో 23 వేల ప్రభుత్వ పాఠశాల మూసివేస్తే ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది కనుక ప్రభుత్వ పాఠశాల మూషివేతను నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని సబ్జెక్టు సరిపడే టీచర్ను స్కావెంజర్ను భర్తీ చేయకుండా ఉన్న పాఠశాలలోనే ఎత్తివేస్తామనడం సిగ్గుచేటు ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలలో కల్పించి విద్యార్థులకు తగిన రీతిలో ఏర్పాటు చేయాలని

## మహితాపూర్ గ్రామ సర్పంచ్ తలారి నాగమణి రాజేష్ ఆధ్వర్యంలో

# ఘనంగా 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు.

**రాయికల్ మండలం ఆగస్టు,15( రిపబ్లిక్ న్యూస్)**

డెబ్బై తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకుని ఎనుబది సంవత్సరాల అడిగిడిన సందర్భంగా దేశంలో అంతటా ఈ రోజు ఎనుబది సంవత్సరాల స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా జరుపుకున్నారు. గత 14 ఆగస్టు 1947 సంత్సరము రోజున అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో మన దేశం నుంచి బ్రిటిష్ వారు మన దేశం ను విడిచి పెట్టి వెళ్లిపోయారు మనకు మన దేశం కు స్వేచ్ఛగా జీవించుట కొరకు మనకు స్వతహాగా అందరం కలిసి కట్టుగా ఉండి ఆరోజు నుండి తెల్లరితే 15 ఆగస్టు అందుకని ఆనాటి నుండి మన దేశంలో అంతట పదిహేను ఆగస్టు రోజున స్వతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్న ము. జగిత్యాల జిల్లా రాయికల్ మండల పరిధిలోని మహితాపూర్ గ్రామ పంచాయతీ లో సర్పంచ్ తలారి నాగమణి రాజేష్ ఆధ్వర్యంలో ఘనంగా స్వతంత్ర దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలో హైస్కూల్ యందు చదువుతున్న విద్యార్థులు పదవ తరగతి చదువుతున్న కడ హర్సిని ఎనిమిదో తరగతి చదువుతున్న కడ దీక్షిత లు వీరు ఇద్దరూ కూడా స్వంత అక్కచెల్లెలు వీరు ప్రపంచ వ్యాప్తంగా పేరు తీసుకు వచ్చే విధంగా లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ ఇండియాలో పేరు తెచ్చుకుని ప్రపంచవ్యాప్తంగా గ్రామ పేరు వినిపించే విధంగా చేసి జిల్లా కలెక్టర్ నుంచి బెస్ట్ అవార్డు గ్రహీత శ్వేతపత్రం స్వీకరించిన సందర్భంగా ఆ విద్యార్థినీలకూ




గ్రామంలో జరిగిన వేడుకల్లో గ్రామస్తుల మధ్య గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల తో కలిసి వారిని ఘనంగా సన్మానించారు..గ్రామంలో అన్ని పార్టీల నాయకులు పదిహేను స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వారు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం హై స్కూల్ యందు ప్రధాన ఉపాధ్యాయులు ముక్కల మోహన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తరువాత అక్కడ వేదిక పైన పలువురు విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఘనంగా గొప్పగా దేశంలో స్వతంత్ర దినోత్సవం మనకు ఎలా వచ్చిందో చాలా చక్కటి ఉపన్యాసం లు ఇచ్చారు. అలాగే వేదిక పైన పలువురు విద్యార్థుని విద్యార్థులు చక్కగా పలు జానపద గేయాలకు పాటలకు డాన్సింగ్ చాలా చక్కగా చేయడంతో అందరూ చాలా సంతోషం వ్యక్తం చేశారు. స్కూల్ ఉపాధ్యాయుల ను పలువురు నాయకులు గ్రామస్తులు అభినందించారు.స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పదోతరగతి చదువుతున్న విద్యార్థి పస్తం కృపాకర్ గ్రామంలో ఉన్న గ్రామస్తుల అందరికీ కను విందు జరిగేలా స్వతంత్ర మనకు ఎలా వచ్చిందో చాల చక్కగా అరోజుల ల్లో మన దశంలో బ్రిటిష్ వారు ఎలా పాలించేవారో ఒక్క పంజరం లో మనసు బంధించి ఏ విధంగా చిత్రహింసలకు గురి చేశారో మరియు మనకు ఏ విధంగా బ్రిటిష్ పాలకుల మధ్య నుండి మనం బయటకు వచ్చాము అనే చిత్రంలో కనిపించే విధంగా ఈ చిత్ర పటం ను గ్రామంలో ర్యాలీలో పట్టుకుని తిరగడం చాలా ఆసక్తిగా ప్రజలు అందరూ కూడా చూసీ సంతోషంగ నవ్వుతు తిలకించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తలారి నాగమణి రాజేష్, ఉప సర్పంచి దొంగ ప్రణయ్ రెడ్డి,గ్రామ పంచాయతీ సభ్యులు గంగా మల్లయ్య శ్రీనివాస్,రమ సత్యనారాయణ,సద్ది సంగీత కొల్ల ప్రమీల, నెమిళ్ల లత, బొమ్మన లక్ష్మి బాబు, లక్ష్మణ్,పరమేశ్వరు, దివాకర్ నవీన్, మాజీఎంపిటిసిగోపి రాజారెడ్డి, మాజీ సర్పంచ్ మాజీ మార్కెట్ కమిటీ చెంర్మన్ గన్నే రాజారెడ్డి గ్రామ కార్యదర్శి మహేష్ అంగన్వాడీ కార్యకర్తలు లత శాంత మమత బంతి ఆశా వర్కర్లు బొమ్మన శంకరమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

## మూడు తులాల బంగారు హారం అందజేత



**మహానంది, ఆగస్టు 15, రిపబ్లిక్ న్యూస్**

విజయవాడ నగరానికి చెందిన విజయలక్ష్మీ, మూర్తి దంపతులు శనివారం మహానందికి వచ్చారు. కోనేరులో స్నానం చేస్తుండగా మూడు తులాల బంగారు నక్లెస్ పడిపోయింది. స్నానం అనంతరం బయటికి వచ్చిన వారు గమనించి వెంటనే ఆలయ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ఏజెన్సీ సిబ్బంది చేత వెతికించి దొరికిన హారాన్ని భక్తులకు అందించడంతో హర్షం వ్యక్తం చేస్తూ ఆలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## అన్నప్రసాద పథకానికి రూ. 1.50 లక్షలు విరాళం



**మహానంది, ఆగస్టు 15, రిపబ్లిక్ న్యూస్**

మహానంది దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి శనివారం పలువురు భక్తులు విరాళాలు అందించారు. కర్నూలు జిల్లా రేమట గ్రామానికి చెందిన సర్వేశ్వర రెడ్డి రూ. లక్ష విరాళం అందించారు. ఆయనతో పాటు నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి దంపతులు రూ. 50, 580 చెల్లించారు. విరాళాలు చెల్లించిన దాతలకు ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఆలయ సూపరింటెండెంట్ నీలకంఠేశ్వర రాజు స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి శేష వస్త్రాలతో సన్మానించి బాండు ఇచ్చారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### - మహానంది మండల ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు

### - అభినందించిన మండల నాయకులు



**మహానంది, ఆగస్టు 15, (రిపబ్లిక్ న్యూస్)**

మహానంది మండలంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహానంది దేవస్థానం ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఎస్సై రామ్మోహన్ రెడ్డి, ఏఈఓ ఎరమల మధు లకు లకు ఉత్తమ అవార్డులు లభించాయి. ఈ మేరకు నంద్యాల లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఎస్పీ సునీల్ షోరాణ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్న వారిని మండల నాయకులు, ప్రముఖులు అభినందించారు.



**మహానంది వ్యవసాయ కళాశాలలో:**

మహానంది సమీపంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ శ్యామ్ రాజ్ నాయక్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఉత్తమ విద్యార్థినిగా నిలిచిన నిఖిల కు రూ ఐదు వేల నగదు బహుమతి అందించడంతోపాటు ప్రశంసా పత్రం ఇచ్చి అభినందించారు. మహానంది దేవస్థానం కార్యాలయంలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, పోలీస్ స్టేషన్లో ఎస్సై రామ్మోహన్ రెడ్డి జెండా ఆవిష్కరించారు.





# అంబేద్కర్ సంఘం నూతన అధ్యక్షుడు తాలూకా లక్ష్మణ్ జెండా పతాక ఆవిష్కరణ.





**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జి ఆగస్టు 15**

80వ స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అందోల్ అంబేద్కర్ సంఘం నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తాలుక లక్ష్మణ్ జెండా పతక ఆవిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎందరో స్వతంత్ర సమరయోధుల త్యాగాలు పోరాటాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛ వాయువులు గెలుస్తూ స్వతంత్ర ఫలాలను అనుభవిస్తున్నామని ఆయన తెలిపారు. దేశ స్వతంత్రం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుల సేవను స్మరించుకోవడం మన బాధ్యత అని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం యువజన నాయకులు మోహన్, బట్ట నరసింహులు, రాజు, బాలమణి, తుప్పురపు సురేష్, ఉషయ్య, యేసయ్య, విష్ణు, శ్రీకాంత్, కిష్టయ్య, ప్రభాకర్, తుడుం పోచయ్య, ప్రసాద్, తుడుం రాములు, తుడుం రాజు, బాజిత్ అశోక్, తుడుం పాపయ్య, సుభాష్, తుప్పరపు సత్తయ్య, అంబేద్కర్ యువజన నాయకులు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓర్వకల్లులో అగస్త్య సోలార్ పరిశ్రమకు శ్రీకారం

### ముఖ్య అతిథులుగా పాల్గొన్న గౌరు కుటుంబం -కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయడమే లక్ష్యం

**ఓర్వకల్ ప్రతినిధి, ఆగస్టు 15 (రిపబ్లిక్ న్యూస్)**

ఓర్వకల్లు మండల పారిశ్రామికవాడలో ఏర్పాటు కానున్న అగస్త్య సోలార్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో గౌరు వెంకట్‌రెడ్డి, గౌరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. రూ.7,800 కోట్ల పెట్టుబడితో 120 ఎకరాల్లో 12 గిగావాట్ల సామర్థ్యంతో పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఓర్వకల్లు అభివృద్ధికి రూ.2,800 కోట్లతో మౌలిక వసతుల పనులు చేపడుతున్నామని, పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓర్వకల్ మండలం టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు




# సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం...

## హెలిప్యాడ్ వద్ద మంత్రులతో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన నీలం మధు..




**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 15**

సంగారెడ్డి పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ఘన స్వాగతం పలికారు. కంది ఐ ఐ టి హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి నీలం మధు పుష్పగుచ్ఛం అందించి, సాదరంగా ఆహ్వానించారు. మంత్రులు, ముఖ్య కాంగ్రెస్ నేతలతో కలిసి వచ్చిన నీలం మధు ముదిరాజ్ ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి నుంచి సంగారెడ్డి ఐ బీ గెస్ట్ హౌస్ వద్ద జగ్గారెడ్డి, నిర్మలా జగ్గా రెడ్డి గార్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్, మంత్రులతో కలిసి పాల్గొన్నారు.

అనంతరం అక్కడి నుంచి అంబేద్కర్ స్టేడియంలో సభ ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రధాన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనరసింహ,వివేక్ వెంకటస్వామి, ప్రజాప్రతినిధులతో కలిసి నీలం మధు పాల్గొన్నారు. ఈ వేదికపై నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, నియోజకవర్గాల అభివృద్ధి పనులపై చర్చించారు. గత పదేండ్లలో అప్పటి కె సి ఆర్ ప్రభుత్వం పేద ప్రజలను విస్మరిస్తే సీ ఎం రేవంత్ రెడ్డి లక్షలాది మంది పేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డులను అందించిన విషయం గుర్తు చేశారు. సంగారెడ్డి జిల్లాలోని పటాన్ చెరు నియోజకవర్గం నుండి చిట్కుల్ కి చెందిన సంగన్నగారి సంతోష, రుద్రారంకి చెందిన కృష్ణవేణి గార్లకు సీఎం చేతుల మీదుగా నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన దిశానిర్దేశం సభలో విశేష ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమాలలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జిలు, చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..





## పోలీసుల ఆధ్వర్యంలోప్రజా చైతన్య అవగాహన కార్యక్రమం




**రైల్వే కోడూరు ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్.**జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు మరియు ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్ మండలంలోని వై.కోట గ్రామాన్ని సందర్శించి ప్రజలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గ్రామ ప్రజలు పరస్పర విభేదాలకు తావివ్వకుండా, ఎటువంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడకుండా శాంతిభద్రతలకు సహకరించాలని గ్రామస్తులను చైతన్య పరుస్తూ,ఎన్నికల సమయంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగి స్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా రాబోయే వినాయక చవితి పండుగ, విగ్రహ ప్రతిష్ఠ, ఊరేగింపులు, నిమజ్జనం తదితర కార్యక్రమాల్లో పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన, ముఖ్యంగా గుర్తుతెలియని లింకులు, ఓటీపీ లు, బ్యాంకు వివరాలు, యూపీఐ మోసాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించారు.

గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్ల ఇళ్లను తనిఖీ చేసి, వారి ప్రస్తుత కార్యకలాపాలు, ప్రవర్తనపై పోలీసు అధికారులు పరిశీలన నిర్వహించారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## అల్మాయిపేట బి ఆర్ఎస్ నాయకులు

# గౌస్ జన్మదిన వేడుకలు





**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 15**



ఆందోల్ మండలం అల్మయ పేట గ్రామంలో గౌస్ పుట్టినరోజు వేడుకలు బి ఆర్ ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ బుడ్డోల్లరవిశంకర్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమక్షంలో గౌస్ పుట్టినరోజు వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ నాయక పుట్టినరోజు నా యొక్క పుట్టినరోజు 15ఆగస్టు రోజున కావడం చాలా శుభ పరిణామంగా భావిస్తూ నా పుట్టినరోజు సందర్భంగా నన్ను ఆదరించి అభిమానించి అందరి మధ్యలో నా పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందాన్ని కలుగజేస్తుందని ఆయన కొనియాడారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు శంకర్ గౌడ్ చాకలి మల్లేశం దండు లింగం పెద్దగొల్ల నర్సింహులు బంటు అఖిల్ బాబా గుండెగల్ల వీరేశం ఆయన యొక్క మిత్రులు అరిప్ బాయ్ ఖాదిర్ బాయ్ అప్రోజ్ నాయకులు పాల్గొన్నారు

## అందోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఫస్ట్ సెకండ్ వచ్చిన వారికి మనీ కవర్ పంపిణీ.

### అందోల్ జోగిపేట మున్సిపల్ 6వ వార్డ్ కౌన్సిలర్ రాచకొండ జ్యోతి ప్రదీప్ గౌడ్.

**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 15**



2025 2026 విద్యా సంవత్సరం 10వ తరగతిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అందోల్ పదవ తరగతిలో ఫస్ట్ క్లాస్ మార్కులు వచ్చిన వారు నికిత 573 మార్కులు, ముఖన బేగం 570 మార్కులు వచ్చిన వారికి అందోల్ జోగిపేట మున్సిపల్ 6వ వార్డు కౌన్సిలర్ రాచకొండ జ్యోతి ప్రదీప్ గౌడ్ విద్యార్థినిలకు మనీ లిపప కవర్ అందజేశాడు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో చదువులు చదువుకొని ఇంకా మంచి మార్కులు తెచ్చుకొని తల్లిదండ్రుల ఆశయాలు నిలబెట్టి ఉన్నత స్థాయిని ఎదగాలని కౌన్సిలర్ రాచకొండ జ్యోతి ప్రదీప్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధాన ఉపాధ్యాయులు దేవిదాస్, కృష్ణ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## రోళ్ళపాడ్ గ్రామ ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.

**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 15**



అందోల్ మండలం రోళ్ళపాడ్ గ్రామంలో ప్రభుత్వ స్కూల్లో చిన్నారులు స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని విధి వీధిలో తిరుగుతూ మువ్వన్నెల జెండాను ఎగురవేసుకుంటూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు ఇస్తూ గ్రామంలో ఒక పండగ వాతావరణాన్ని నెలకొల్పారు తదనంతరం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పలు కార్యక్రమాల్లో పాల్గొని స్వాతంత్ర పోరాటంలో పోరాడినటువంటి మహానీయులను స్మరించుకోవడం మన బాధ్యత అని వాళ్ళు కొనియాడారు. భారత్ మాతాకీ జై, అంటూ చిన్నారులు నినాదాలతో పండగ వాతావరణం నెల కోల్పారు.

## అంబేద్కర్ నగర్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణ

# అంగ రంగ వైభవంగా సంబరాలు.







**రైల్వే కోడూరు ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్.**

భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం జరిగినది, రిటైర్డ్ జడ్జి గుర్రప్ప చేతుల మీదుగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరిగినది

రాజకీయాలకు అతీతంగా, అధికారుల ప్రోత్సాహంతో, స్థానిక గ్రామ వాసుల ఆర్థిక సహాయంతో వారి చేతుల కష్టముతో, యువకులు పెద్దలు, వివిధ గౌరవప్రదమైనటువంటి వస్త్ర ఆదరణ ధరించి కనులు పండగగా సీరియల్ సెట్స్, బాణా సంచారములు సంబరాలు, నింగికి ఎగిసే లాగున ఘనంగ కొనసాగింది ఈ గ్రామమునకు 200 సంవత్సరాల చరిత్ర కలదు ,కేవలం ఒకే ఒక్క కులం కలిగిన వీరు 1600 మంది జనాభా వున్నారు, 180 ఇండ్లు కలిగి, 650 కి పైగా ఓటర్లు, 200 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు కలిగిన ఈ గ్రామం వాసులు 25 సంవత్సరాల చిరకాల కోరిక, అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కల నేటికీ ఆవిష్కృతమైనందుకు గ్రామస్తులు సంతోసం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా పి.గుర్రప్ప రిటైర్డ్ జిల్లా జడ్జ్ ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎస్సీలలో జన్మించకుండా పోయి ఉంటే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల జీవితాలు అతలాకుతలమైపోయేటివని, అనుకుంటే భయం వేస్తుంది ఈనాడు కూడు, గుడ్డ ,గూడు ,కలిగి సమాజంలో చదువులతో ,రాజకీయాలలో, మనం ఉన్నత స్థానాల్లో తింటున్నామంటే అది అంబేద్కర్ పుణ్యమేందని ఆయన అన్నారు, రిటైర్డ్ హెడ్మాస్టర్ ఎం.సీ. చెంచురత్నం మాట్లాడుతూ మహా మేధావి, బోధిసత్వ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను మా గ్రామంలోని బిడ్డలకు నేర్పించి మాటలలో కాకుండా చేతలలో చూపిస్తూ, మా గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా చేయాలని మా ఆకాంక్ష అన్నారు, ఏపీజీ అండ్ బిసి డైరెక్టర్ పులేల రమేష్ బాబు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావులో ఒకరు, భారత రాజ్యాంగ నిర్మాత ఈయన కేవలం ఎస్సీలకి పరిమితమని ఆయనను అంటగట్టడం సరికాదు రాజ్యాంగం నిర్మించడమే కాదు కష్టజీవుల పని సమయాన్ని మార్చిన వాడు సహోదరీలకు సెలవులు మంజూరు చేపించినటువంటివాడు అనేక విషయాల్లో ఆయన యొక్క పాత్ర ఎంతో ఉంది. ఇటువంటి జ్ఞాని భారతదేశం లో పుట్టడం భారతీయులందరూ గౌరవించాలి మానవత్వం అని ఏపీ జి అండ్ బిసి డైరెక్టర్ పులేల రమేష్ బాబు అన్నారు ఈ కార్యక్రమంలో

ముఖ్యంగా మా గ్రామస్తులు అందరి సహకారంతో ఈ యొక్క గొప్ప కార్యక్రమం జరిగింది ఇందులో ముఖ్యంగా రిటైర్డ్ హెడ్మాస్టర్ ఎంసి చెంచురత్నం స్కూల్ అసిస్టెంట్, ఏపీజీ అండ్ బి సి డైరెక్టర్ మరియు సివిల్ కోర్ట్ కోడూర్ వైస్ ప్రెసిడెంట్ పులెల రమేష్ బాబు, స్కూల్ అసిస్టెంట్ వై.ప్రసాద్, ఇ.సుబ్బారావు, పి శివకుమార్, టి భాస్కర్, టీ డానియల్, యువకులు అందరి సమిష్టి కృషి ఫలితమే నేటి గొప్ప విగ్రహ ఆవిష్కరణ అని రమేష్ బాబు తెలియజేశారు.

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న సిద్దేశ్వర రావు.

**రైల్వే కోడూరు ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్.**






మండల కేంద్రం ఓబులవారిపల్లి తాసిల్దార్ కార్యాలయంలో తహసీల్దారుగా అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను 80 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రశంస పత్రం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా తాసిల్దార్ సిద్దేశ్వర రావు అందుకొన్నారు,

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో తాసిల్దార్ సిద్దేశ్వర రావు ప్రశంస పత్రం వృత్తిలో అంకితభావంతో సమర్థవంతంగా తన విధులను ప్రజాసేవలో నిర్వర్తించినందుకుగాను ఈ పురస్కారం అందుకున్నారు ఈయన ఓబులవారిపల్లె మండల రెవెన్యూ కార్యాలయంలో తాసిల్దారుగా బాధ్యతలు చేపట్టి సుమారు రెండు నెలల 15 రోజులు కావడం విశేషం అతి తక్కువ కాలంలో ప్రజలకు రైతులకు అధికారులకు ఉత్తమ సేవలో అందించినందుకు గాను ఆయనకు ఏ పురస్కారం లభించింది ఆయనకు బంధువులు స్నేహితులు తోటి అధికారులు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

అతి ఉత్కృష్ట సేవా పథకం మెడల్ అందుకున్న హేమాద్రి చిట్వేల్ స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్. హేమాద్రి తన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రంతో పాటు అతి ఉత్కృష్ట సేవా పథకం మెడల్ను అందుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

విధి నిర్వహణలో అంకితభావం, సమర్థత, నిబద్ధతతో సేవలందించినందుకు హేమాద్రిని అధికారులు అభినందించారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారం అందుకోవడం పట్ల సహచర పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ హేమాద్రికి శుభాకాంక్షలు తెలిపారు.

## మండల రెవెన్యూ, అభివృద్ధి కార్యాలయాల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.





**రైల్వే కోడూరు ఆగస్టు 15 రిపబ్లిక్ న్యూస్.**

మండల కేంద్రం ఓబులవారిపల్లి మండల రెవెన్యూ అధికారి కార్యాలయం మరియు మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు, ముఖ్య అతిథులుగా కూడా చైర్మన్ రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కా రూపానంద రెడ్డి, రైల్వే కోడూరు జనసేన పార్టీ శాసనసభ్యులు అరవ శ్రీధర్ పాల్గొన్నారు ముందుగా తాసిల్దార్ సిద్దేశ్వర రావు ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే కూడా చైర్మన్ జాతీయ జెండా ఎగరవేసి జాతీయ జెండాకు సెల్యూట్ చేశారు అనంతరం మండల అభివృద్ధి అధికారి ఎన్ వి ఎన్ రాజేంద్ర ఆధ్వర్యంలో మండల అభివృద్ధి కార్యాలయం ఎదుట జండా ఎగరవేసి సెల్యూట్ చేశారు అనంతరం పాఠశాల విద్యార్థులు అధికారులు జాతీయగీతం మరియు వందేమాతర గీతం ఆలపించి జాతీయ పతాకానికి సెల్యూట్ చేశారు ఈ కార్యక్రమంలో మండల సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ ఆయన సిబ్బంది పాల్గొని వందేమాతరం, జనగణమన చేసి జెండాకు వందనం చేశారు ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి మల్లికార్జున రెడ్డి, డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి రామ్మోహన్ రెడ్డి,కృష్ణ, ఏవో ప్రకాష్, ఏపిఎం ధనుంజయ ఎపిఓ మల్లికార్జున ఇంజనీర్ ఆంజనేయ ప్రసాద్,వీఆర్వోలు అంబర్పు శ్రీనివాసులు షేక్ భాను శంకరయ్య రాంబాబు మనోహర్ సర్వేర్లు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు అంతకుముందు పోలీస్ స్టేషన్లో తన



సిబ్బందితో ఎస్సై సుజన్ కుమార్ స్టేషన్ ఆవరణలో ఫ్లాగ్ ఎగరవేసి జాతీయ పతాకానికి అందరూ సెల్యూట్ చేశారు అనంతరం స్టేషన్ ఆవరణలో స్వీట్లు పంచుకున్నారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రమణ సిబ్బంది పాల్గొన్నారు.